రేపు నీటి పారుదల సలహా మండలి సమావేశం

ఏలూరుసిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం గురువారం జరుగుతుందని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ సీహెచ్.దేవప్రకాశ్ మంగళవారం తెలిపారు. గోదావరి పశ్చిమ డెల్టాకు రబీ సీజన్ లో నీటి లభ్యత, ఆయకట్టు, రబీ అనంతరం కాలువలు మూసివేతపై చర్చిస్తారు. జిల్లాలోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో పంట విస్తీర్ణం, నీటి విడుదల తేదీ, తదితర అంశాలు చర్చించడం జరుగుతుందన్నారు.

సోషల్ వార్



వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్షాల ముఖ్యనేతలపై సాగించిన సోషల్ మీడియా అరాచకాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించడం తెలిసిందే. తమ నేతలపై అభ్యంతరకరమైన పోస్టులు పెట్టారంటూ కూటమి శ్రేణులు పలుచోట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో జిల్లాలో పలు చోట్ల 13 ఫిర్యాదులతో పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేశారు. వైసీపీ నేతలు కూడా ఫిర్యాదు చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ మేరకు అధిష్ఠానం కార్యాచరణ రూపొందించిందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అధికార పక్షంపై ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని రచ్చచేసే ప్రయత్నాలు చేయనున్నారు. ప్రధాన పార్టీ సోషల్ వార్ కేసుల వైపు సాగుతోంది.

జిల్లాలో 13 ఫిర్యాదులు, ఏడుగురి అరెస్ట్

- అసత్య పోస్టింగ్‌లు పెట్టిన వారిపై పోలీసులకు ఫిర్యాదు
- వెను వెంటనే అరెస్టులు
- వైసీపీ ఉక్రోషం
- టాస్క్‌ఫోర్స్ పేరిట కార్యాచరణ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఐదేళ్ల జగన్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షానికి చెందిన ముఖ్య నేతలపై సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణకు దిగారు. ఇష్టానుసారం పోస్టులతో బురద చల్లారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు అనుకూలంగా ఉన్న కొందరు సోషల్ మీడియాను వేదికగా చేసుకుని చెలరేగిపోయారు. వ్యక్తిగత నిందలతో అప్రదిష్టపాలు చేసిన వారు ఎందరో. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల సంఖ్య చూస్తే చాలా తక్కువ అని చెప్పాలి. నెలల తరబడి వందలాది పోస్టింగ్‌లతో సోషల్ మీడియాలో రెచ్చిపోయారు. వాటిలో కొన్నింటిపై కొందరు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కదిలారు. జిల్లా వ్యాప్తంగా ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు స్పందిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై అనేక సెటైర్లు, నిందారోపణలతో పోస్టింగ్‌లు పెట్టడానికి పోటీ పడ్డారు. వైసీపీ నిర్వహిస్తున్న సోషల్ మీడియా విభాగం డైరెక్షన్ లోనే ఇదంతా సాగింది. అప్పట్లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్వామి భక్తిని ప్రదర్శించి కేసుల నమోదు చేయలేదు. ప్రజల నుంచి వ్యతిరేకత లేదని భావించి వైసీపీ అనుకూలురంతా సోషల్ మీడియాలో రెచ్చిపోయి వ్యవహరించారు. ఎన్నికలకు ముందు జనసేన, టీడీపీపై బురద చల్లడమే లక్ష్యంగా సోషల్ మీడియా పోస్టులతో రెచ్చిపోయారు. ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయంతో కొందరు వెనక్కి తగ్గారు. ఇంకొందరు అదే స్పీడును కొనసాగించి వ్యక్తిగత దూషణలతో పోస్టింగ్‌లను కొనసాగిస్తున్నారు.

డొంక కదులుతోంది

ఐదేళ్లపాటు ఇష్టానుసారం వ్యవహరించి వైసీపీ పెయిడ్ వర్కర్లుగా ఉన్న అనేకమంది ప్రతిపక్ష పార్టీ నేతల కుటుంబీకులపై పోస్టింగ్‌లు పెట్టడంలో పోటీ పడ్డారు. ఇప్పుడు అటువంటి వారంతా చల్లగా జారుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సోషల్ మీడియాలో ఐదేళ్లపాటు అరాచక ప్రచారానికి దిగిన వారి గుట్టును వెలికితీస్తున్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు ఈ తరహా సోషల్ భూతాలపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 13 కేసులు నమోదుకాగా ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కైకలూరు రూరల్, నూజివీడు రూరల్, ఏలూరు టూటౌన్, ధర్మాజీగూడెం, వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో సోషల్ మీడియాలో కొందరు పెట్టిన అరాచక పోస్టులపై ఆధారాలతో సహా టీడీపీ, జనసేన కార్యకర్తలు ఆయా స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియాలో అసభ్య, అరాచక పోస్టింగ్‌లు పెట్టిన బోరుగడ్డ అనిల్‌పై వేలేరుపాడు స్టేషన్‌లో ఒక మహిళ ఫిర్యాదు చేశారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌ను కించపరుస్తూ చేసిన దూషణలపైనా ఆమె ఆధారాలతో ఫిర్యాదులో పేర్కొనడంతో బోరుగడ్డ అనిల్‌ను ఇటీవల వేలేరుపాడు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. అనంతరం జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరుపర్చారు. ఇలాంటి అరాచకవాదులను ఎక్కడ పెట్టాలో అక్కడే పెట్టాలని టీడీపీ, జనసేన కార్యకర్తలు ఆవేశంతో ఊగిపోతున్నారు. ఇదికాక మిగతా కొంతమందిని ఇంకా అరెస్టు చేయాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ఎవరెవరిపై కేసులు నమోదవుతున్నాయి, పోలీసుల తీరుపైనా ఇప్పటికే ఒక కన్నేసి ఉంచారు. దీంతో సాధ్యమైనంత మేర ఫిర్యాదు అందిన వెంటనే స్పందించడం, సమాంతరంగా అరెస్టులకు ప్రయత్నించడం జరుగుతూనే ఉంది. టీడీపీ, జనసేన కార్యకర్తలు దూకుడుగా వైసీపీ అనుకూలురపై కేసులు పెడుతుండడంతో వైసీపీ ఫిర్యాదులు చేయనుంది. కేసులు నమోదుకాకపోతే రచ్చ చేస్తామంటూ ఆ పార్టీ రంగంలోకి దిగింది.

ఢీ అంటే ఢీ

ఇంతకాలం తమను కించపరిచి ఇష్టానుసారం చెలరేగిపోయిన వైసీపీ అనుకూల మూకలపై ఎవరు ఫిర్యాదు చేసినా తక్షణం పోలీసులు స్పందించి అరెస్టు చేస్తుండడంతో వైసీపీ మొదట్లో కంగుతింది. తమ పార్టీ పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉండడంతో కావాలనే అరెస్టులు చేస్తుంటారనే ధోరణిలో దీనిని మరింత రచ్చ చేయాలని వైసీపీ నిర్ణయించింది. సోషల్ మీడియాలో పోస్టులపై అరెస్టులు చేస్తుండడం, వారంతా తమ పార్టీకి చెందిన వారు కావడంతో పార్టీపరంగా కొత్త కార్యాచరణ ప్రకటించింది. జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ పేరిట ఒకరిద్దరికి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైసీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యులుగా ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ నియోజకవర్గ కన్వీనర్ కారుమూరి సునీల్‌కుమార్, ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ జయప్రకాష్‌ను నియమించారు. మాజీ సీఎం జగన్, పార్టీ నేతలపై సోషల్ మీడియాలో వస్తున్న పోస్టింగులపై కేసులు పెట్టాలని వైసీపీ అన్నీ సిద్ధం చేసుకుంటుంది. దీంతో సోషల్ మీడియా వార్ జిల్లా అంతటా ఇకముందు ముదరబోతుంది.

43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ఏలూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంతవరకు రూ. 99.05 కోట్లు విలువైన 43,004.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఉంగుటూరు మండలంలో రూ.37.50 కోట్లు విలువైన 1601.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదిస్తే సిబ్బంది స్వయంగా కళ్లాల వద్దకు వచ్చి ధాన్యాన్ని పరీక్షిస్తారని, నిబంధనల మేరకు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తారన్నారు. ధాన్యం రైస్ మిల్లుకు తరలించిన 48 గంటల్లోపే రైతు ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాలో ధాన్యం సొమ్ము జమ అవుతుందన్నారు. రైతులకు ఎటువంటి సందేహాలున్నా జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ 08812-230448, 7702003584), టోల్‌ఫ్రీ నెంబరు 18004256453లో సంప్రదించాలని సూచించారు.

మరుగు దొడ్లు వినియోగించాలి

ఏలూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): వ్యక్తిగత, కమ్యూనిటీ మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. డబ్ల్యుఎస్ఎం (డిస్ట్రిక్ట్ వాటర్ శానిటేషన్ మిషన్) జిల్లా స్థాయి కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన మంగళవారం జరిగింది. కమిటీకి కన్వీనర్‌గా ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వ్యవహరించగా మరో 10 శాఖల జిల్లా అధికారులు కమిటీలో సభ్యులుగా ఉన్నట్లు జెసి ప్రకటించారు. వరల్డ్ టాయిలెట్ డే పురస్కరించుకుని మంచి పారిశుధ్య సేవలు అందిస్తున్న పలువురు క్లాప్ మిత్రులను జాయింట్ కలెక్టర్ సత్కరించారు.



బంగారు తల్లి..

- మావుళ్లమ్మకు బంగారంతో చీర తయారీ ప్రక్రియ మొదలు

భీమవరం టౌన్, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): బంగారు తల్లి.. మావుళ్లమ్మ ఆలయానికి భద్రత పెరగనుంది. అమ్మవారికి భారీగా బంగారు ఆభరణాలు ఉన్నాయి. మరోవైపు బంగారు చీర తయారీ ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో ఆరుగురు గన్‌మెన్‌లతో నిరంతరం గస్తీ నిర్వహించేలా చూడాలని ఎమ్మెల్యే అంజిబాబు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అమ్మవారికి వంద కేజీల బంగారంతో చీర తయారు చేయించాలనే సంకల్పంతో 2009-14 మధ్య ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శ్రీకారం చుట్టారు. దాతల నుంచి 74 కేజీల బంగారం రావడంతో 50 కేజీలతో తొడుగు తయారు చేయించి అమ్మవారికి అలంకరించారు. మరో 24 కేజీల బంగారు చీరకు ఆభరణాలు చేయించాలని ప్రతిపాదించారు. అప్పటి ప్రభుత్వం గతంలో మాదిరి ప్రైవేట్ వ్యక్తులతో కాకుండా తిరుమల తిరుపతి దేవస్థానంలో వున్న మింట్‌లో చేయించాలని ఉత్తర్వులు వచ్చాయి. దీనిపై అప్పటి అధికారులు మింట్‌ను సంప్రదిస్తే నాలుగేళ్ల వరకు అవకాశం లేదని తేల్చి చెప్పడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అప్పటి నుంచి బంగారు చీరకు సంబంధించి ఎలాంటి కదలిక లేకపోయింది. అంజిబాబు మళ్లీ ఎమ్మెల్యేగా రావడంతో 24 కేజీలతో బంగారు చీర తయారీ పనులకు కదలిక వచ్చింది. పూర్తిస్థాయి చీరకు కావాల్సిన మరో 26 కేజీల బంగారం దాతల నుంచి సేకరించే ప్రయత్నాలు కొనసాగనున్నాయి. 'శాశ్వత బంగారు చీరతో మావుళ్లమ్మ భక్తులు దర్శనం ఇచ్చేలా చేయాలన్నదే మా సంకల్పం. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. ఆలయానికి రక్షణ నిమిత్తం మూడు షిఫ్టుల్లో ఆరుగురు గన్‌మెన్‌లతో భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరాం' అని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తెలిపారు.

పోక్సో నేరస్థులపై ప్రత్యేక నిఘా: ఐజీ

చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు ఒడిగట్టే పాత నేరస్తులపై రౌడీషీట్లను ఓపెన్ చేసి ప్రత్యేక నిఘా పెడతామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ద్వారకాతిరుమల చిన వెంకన్నను మంగళవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిశీలించారు.

7

రైళ్ల దారి మళ్లింపు

ఏలూరు మీదుగా వెళుతున్న కొన్ని రైళ్లను దారిమళ్లించారు. ఏలూరు, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లలో స్టాప్ ఉండదని రైల్వే అధికారులు ప్రకటించారు.



బడి గంట అదనం

- రేపటి నుంచి 'పైలట్' పనివేళలు !
- జిల్లాలో 28 పాఠశాలల్లో అమలుకు నిర్ణయం

ఏలూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల తరగతుల సమయం పెంపు పైలట్ ప్రోగ్రాం జిల్లాలో అమలుకు అధికారులు నిర్ణయించారు. పైలట్ ప్రోగ్రాం పేరిట పనివేళల పెంపు నెల్లూరు జిల్లాకే పరిమితమని భావించినప్పటికీ, అన్ని జిల్లాలకూ వర్తింపజేయడానికి నిర్ణయం జరిగిందని తెలుస్తోంది. గత శుక్ర, శనివారాల్లో జిల్లాలోని 28 మండలాల ఎంఈవోలను సంప్రదించిన విద్యాశాఖ అధికారులు మండలానికి ఒక హైస్కూలు పేరును పైలట్ ప్రోగ్రాం కోసం పంపాలని ఆదేశించారు. ఎంఈవోలు సూచించిన 28 ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 21 నుంచి పెంచిన పనివేళలను అమలు చేయనున్నట్టు విద్యాశాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ నెల 18నుంచే పెంచిన పనివేళలను అమలు చేయాలని తొలుత నిర్ణయించినా కొద్దిరోజులు వాయిదా వేసినట్టు వివరించాయి. మండలానికి ఒకటి చొప్పున ఎంపిక చేసిన హైస్కూళ్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగేలా టైంటేబుల్ సిద్ధం చేశారు. తాజా ప్రతిపాదనల ప్రకారం పైలట్ ప్రోగ్రాం తొలుత పది రోజులపాటు కొనసాగించి, ఫీడ్‌బ్యాక్‌ను బట్టి అనంతరం చర్యలు చేపడతారు. ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పనిచేస్తుండగా, పదో తరగతి విద్యార్థులకు కొన్ని హైస్కూళ్లలో ప్రత్యేక తరగతుల పేరిట రెమిడియల్ క్లాసులను నిర్వహిస్తున్నారు. జిల్లాలో పైలట్ ప్రోగ్రాం అమలుపై బుధవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ కానున్నట్టు తెలిసింది. జిల్లాలో ఎంపికచేసిన హైస్కూళ్లలో గురువారం నుంచి అదనపు పనివేళలు అమలు కానుందనే సమాచారం ఉన్నా జిల్లావిద్యాశాఖ అధికారిక ప్రకటన ఇంకా విడుదల చేయలేదు.

నిరసన వెల్లువ

వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో నూతన పనివేళలు అమలు చేయడానికి ప్రస్తుతం ఎంపికచేసిన హైస్కూళ్లలో పైలట్ ప్రోగ్రాం పేరుతో చేపడుతున్నారని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ.సాల్మన్‌రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర ఆరోపించారు. విద్యార్థుల సైకాలజీ ప్రకారం 7 గంటలు మాత్రమే గ్రాహకశక్తి ఉంటుందని మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు చెబుతుంటారని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం కూడా 7 గంటలేనని, సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు కొనసాగడం వల్ల క్రీడలకు సమయం ఉండదన్నారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులు సుమారు ఐదుకిలోమీటర్లపైబడి దూరంనుంచి స్కూలుకు వస్తారని, వారికి సాయంత్రం 5గంటలవరకు తరగతులు కొనసాగించడంవల్ల ఇబ్బందులు వస్తాయని వివరించారు. ప్రస్తుత పనివేళలనే కొనసాగించాలని డిమాండ్‌చేసారు. విద్యార్థుల అభ్యసన సంసిద్ధత, మానసిక పరిపక్వత, రవాణాసౌకర్యాలు, ప్రజల జీవనవిధానం తదితర అంశాలను పరిగణనలోకితీసుకుని పాఠశాలల్లో పనివేళలను పెంచే విషయమై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, గంధర్వరావు డిమాండ్ చేశారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో 70శాతంపైబడి గ్రామీణ ప్రాంతాలవారేనని, ఇటువంటి ప్రయోగాలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే ఆంగ్ల మాధ్యమ తరగతులు, బోధనతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, పనివేళల పెంపు మహిళా ఉపాధ్యాయులను సమస్యలకు గురి చేస్తుందన్నారు. పనివేళల పెంపు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



డీఈవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్టీపీ నాయకులు

పాఠశాల పని వేళలు పెంచొద్దు

పాఠశాల స్కూలు పనివేళలు పెంచొద్దని, ప్రస్తుత సమయాలనే కొనసాగించాలని ఏపీ స్టేట్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు స్టీవెన్, గంధర్వరావు, రమణ, ప్రసాద్ తదితరులు డీఈవో వెంకటలక్ష్మమ్మకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం డీఈవోను వారు కలుసుకున్నారు. పనివేళల పెంపుతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతారన్నారు. అపార్ డేటా నమోదుపై స్కూల్ హెచ్‌ఎంలను ఒత్తిడి చేయరాదని, వెసులుబాటు కల్పించాలని కోరారు. సంఘ నాయకులు శ్రీనివాసరావు, ఫెడరిక్ బాబు తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో అగ్రి ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం

- జిల్లాలో కలెక్టర్ వెట్రిసెల్వి విస్తృత పర్యటన

దెందులూరు, ఉంగుటూరు, భీమడోలు, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, త్వరిగతిన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. దెందులూరు మండలంలోని మలకచర్ల, కండ్రిగ నరసింహపురం, గండివారిగూడెం గ్రామాల పరిధిలో రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు. ఆర్ అండ్ బీ ఎస్ఈ జాన్‌మోషే, ఈఈ వైవీ కిశోర్ బాపూజీ, డీఈఎం గోవిందమోహన్, ఏఈ మద్దాల శేషకుమార్ వివరాలు తెలిపారు. ఉంగుటూరు మండలంలో ధాన్యం సేకరణ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖ, అక్వా రంగాల క్షేత్రాలను పరిశీలించారు. చేబ్రోలులో అగ్రి ల్యాబ్‌ను పరిశీలించారు. ధాన్యం తేమ శాతం లెక్కింపులో కొంతమంది మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. బాదంపూడి చేపల పెంపకం కేంద్రాన్ని సందర్శించారు. చేబ్రోలులో కనుమూరి మురళీరాజు డ్రాగన్ ఫ్రూట్స్ ఫాం పరిశీలించి జిల్లా ఉద్యాన అధికారి రామ్మోహన్‌రావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. భీమడోలు మండలం పూళ్లలో వరి కోత యంత్రాలతో ధాన్యం మాసూలును కలెక్టర్ పరిశీలించి సాగులో యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. భీమడోలు అగ్రి ల్యాబ్‌ను పరిశీలించి భూసార పరీక్షలు, వరిపై తెగుళ్ల నివారణపై సూచనలు ఇచ్చారు. జిల్లా వ్యవసాయాధికారి జె.డి.హబీబ్ బాషా, ఏడీఏ ఉషా రాజకుమారి, మత్స్యశాఖ జేడీ నాగలింగాచార్యులు, అధికారులు పాల్గొన్నారు.



మామిడి చేదు

- ప్రత్యామ్నాయం వైపు మామిడి రైతుల చూపు
- పూత సీజన్‌లో మామిడి తోటల తొలగింపు
- విస్తరిస్తున్న పామాయిల్, కొబ్బరి, మొక్కజొన్న

తొలగిస్తున్న మామిడి తోటలు



మామిడి తోట స్థానంలో సాగు చేస్తున్న పామాయిల్

(నూజివీడు టౌన్)

నూజివీడు పేరు చెప్తే గుర్తుకు వచ్చేది నవ రసాల మామిడి. నూజివీడు మామిడికి మంచి గిరాకీ. కానీ ఇక్కడ మామిడి తోటలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్ పరిధిలో దాదాపు 40 వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉంది. దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న తెగుళ్లు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతు నష్టాల్లో కూరుకుపోయాడు. ఫలితంగా మామిడిస్థానంలో పామాయిల్, కొబ్బరి, మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఏటా దాదాపు 500 ఎకరాల మామిడి తోటలను తొలగిస్తున్నారు.

తొలగింపు కారణాలు ఎన్నో

నూజివీడు మామిడి నాణ్యత క్రమేణా తగ్గడంతో మార్కెట్లో గిరాకీ తగ్గింది. నూజివీడు ప్రాంతంలో బంగినపల్లితో పాటు తోతాపురి (కలెక్టర్) చెరుకు రసం, చిన్న, పెద్ద రసాలు విస్తారంగా సాగులో ఉన్నాయి. మామిడిపై రాతిమంగు, బూడిదతెగులతో పాటు ఇటీవల కోడిపేను ఉధృతితో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మామిడి పేరు చెప్తే నూజివీడుతో పాటు చిత్తూరు, పలాస ప్రాంతాలు మాత్రమే మామిడి సాగుకు కేంద్రంగా ఉండేవి. అనంతరం తెలంగాణ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మామిడిసాగును విస్తారంగా చేపట్టడంతో నూజివీడు ప్రాంత మామిడికి గిరాకీ తగ్గింది.

పెరుగుతున్న ఇతర పంటలు

మామిడి రైతులు పామాయిల్, కొబ్బరిసాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పామాయిల్‌కు గతంలో తెలుగుదేశం పాలన, ప్రస్తుత కూటమి పాలనలో మద్దతు ధర లభిస్తుండడంతో మామిడి స్థానంలో పామాయిల్ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు పామాయిల్ సాగుకు ప్రోత్సాహకాలతో ప్రతి మండలంలో ఏటా 500పైగా ఎకరాల్లో మామిడి తోటలు కనుమరుగై పామాయిల్ సాగులోకి వస్తుంది. కొబ్బరి సాగు, ఖాళీగా ఉన్న భూముల్లో మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. నూజివీడు ప్రాంతం విత్తన ఉత్పత్తికి అనుకూల ప్రాంతంగా కంపెనీలను గుర్తించడంతో విత్తన మొక్కజొన్న, విత్తన పత్తి సాగుకు కంపెనీల పెట్టుబడితో నూజివీడు మామిడికి వ్యతిరేకంగా ప్రభావం చూపుతోంది.



కాలు కదిలే చోటేది ?

పట్టణాల్లో ట్రాఫిక్ పద్మవ్యూహం

- పెరిగిన వాహనాలు.. ఇరుకైన రహదారులు
- అడ్డదిడ్డంగా నడుస్తున్న ఆటోలతో ప్రమాదాలు
- వెలగని సిగ్నల్స్.. అస్తవ్యస్తంగా ట్రాఫిక్
- రోడ్లు విస్తరించకుంటే భవిష్యత్ మరింత ఇబ్బంది

నిత్యం రణగొణ ధ్వనులతో పట్టణాలు పద్మవ్యూహాలుగా మారాయి. కార్లు, ఆటోలు, బైక్‌లు, లారీలు, బస్సులతో కిటకిటలాడుతున్నాయి. కాలు కదిపే చోటు కూడా లేక.. జనం అడుగులు తడబడుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం తదితర పట్టణాల్లో పెరిగిన వాహన రద్దీతో రోడ్లు ఇరుకుగా తయారయ్యాయి.


6

పద్మ వ్యూహం

పట్టణాల్లో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది.. ఇంటి నుంచి బయటకు వస్తే గమ్యం చేరేవరకు దారీ తెన్నూ కానరావడం లేదు.. పెరిగిపోయిన వాహనాలు, కంట్రోల్ చేసేందుకు తగినంత సిబ్బంది లేకపోవడం, పార్కింగ్ లేక రోడ్లపైనే వాహనాలు నిలిపివేయడంతో ప్రయాణికులకు నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు.. ఏలూరు, భీమవరం, పాలకొల్లు, తణుకు, ఆకివీడు పట్టణాలతో పాటు పలు ప్రధాన కూడళ్లలో వాహనదారులు నరకం చూస్తున్నారు..



ఏలూరు ఆర్ఆర్ పేటలో..



ఏలూరు అస్తవ్యస్తం

ఏలూరు క్రైం : ఏలూరు నగరంలో నడవాలన్నా, వాహనాలు నడపాలన్నా నరకం చూడా ల్సిందే. ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుని క్షణక్షణం సాహ సాలు చేసుకుంటూ ప్రయాణం సాగించాల్సిందే. ఏలూరులో నిత్యం 50 వేల పైబడే జనాభా రాకపోకలు సాగిస్తూ ఉంటారు. నగరంలో ద్విచక్ర వాహనాలు 10 వేలు పైబడి తిరుగుతుండగా, ఆటోలు ఐదు వేల పైనే తిరుగు తూంటాయి. ఇతర వాహనాలు మరో రెండు వేలకు పైబడే రాకపోకలు కొనసాగిస్తున్నాయి. నగరంలో ట్రాఫిక్ క్రమ బద్ధీకరణకు ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉంది. అయినా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు శూన్యమే. నగరంలో ప్రధాన మైన కూడళ్ళు 50 వరకూ ఉండగా, కేవలం 15 నుంచి 20 పాయింట్లలో మాత్రమే నిత్యం బీటుల్లో పోలీసులు విధులను నిర్వర్తించగలుగుతున్నారు. మరో వైపు వ్యాపారులు తమ షాపుల ముందు రోడ్లను అక్రమించి తమ వ్యాపార వస్తువులను రోడ్లపైనే అమ రుస్తున్నారు. వాహనాలను పెట్టే వీలులేక పోవడంతో రోడ్ల పైనే పెడుతున్నారు. దీంతో రోడ్లు బక్కచిక్కిపోతు న్నాయి. ప్రభుత్వాసుపత్రి, ఆర్ఆర్ పేటలలో ఆటోలు ఎక్కపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ఆర్ఆర్ పేటలో రోడ్లపైన బళ్ళతో వ్యాపారాలు చేసేవారు వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారుతున్నారు. కొన్ని హోటళ్ళకు రోడ్డే పార్కింగ్‌గా మారాయి. కొంతమంది కార్ ట్రావెల్స్‌వాళ్లు రోడ్డే పార్కింగ్ ప్లేస్‌లుగా మార్చేసుకున్నారు. ఏలూరు నగరంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయం త్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భారీ వాహనాలకు, ట్రాక్టర్లకు అనుమతి లేదు. కానీ ఇసుక ట్రాక్టర్లు, మట్టి టిప్పర్లు 24 గంటలు తిరిగేస్తు న్నాయి. ప్రభుత్వాసుపత్రి ముందు, ఆర్ఆర్ పేట రోడ్డులో, సెయింట్ థెరిస్సా రోడ్డులో నిత్యం సాయం త్రం 4 గంటల నుంచి ట్రాఫిక్ జామ్ అవుతున్నా ఒక్క పోలీసు అటుగా రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించు కోకపోవడంతో సమస్య మరింత జఠిలమవుతోంది.

భీమవరంలో గజిబిజి



భీమవరం క్రైం : భీమవరం పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు పెరుగుతోంది. పట్టణంలో సుమారు 150 ప్రైవేటు పాఠశా లలు, కళాశాలలు ఉన్నాయి. వాటికి సంబంధించి నిత్యం 400 బస్సులు వరకు పట్టణం మీదుగా వెళు తూంటాయి. ఉదయం దుకాణాలు తెరవడానికి ముందే వెళ్ళడం వల్ల అంత ఇబ్బంది ఉండటం లేదు. సాయంత్రం సమయాల్లో అన్ని పాఠశాలలు, కళాశాలలు ఒకేసారి వదలడం వల్ల పట్టణంలో ట్రాఫిక్ పెరుగుతోంది. భారీ లోడ్ వాహనాలు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను పట్టణంలోకి రాకుండా చేసినప్పటికీ రద్దీ తగ్గడం లేదు. ప్రకాశం చౌక్ సెంటర్ పోలీస్ బొమ్మ సెంటర్, బుధ వారం మార్కెట్, అంబేడ్కర్ సెంటర్, బొంబాయి స్వీటు సెంటర్, సరోవర్ సెంటర్, అడ్డవంతెన వద్ద నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఉండిరోడ్డులోని రైల్వేగేటు వద్ద కిలో మీటర్లు మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. రైల్వేశాఖ డబ్లింగ్ లైన్లు పూర్తి అయ్యాక రైళ్ళను, గూడ్స్ రైళ్ళను భారీగా ఈ లైన్ నుంచి పంపిస్తున్నారు. దీంతో ప్రతీ 20 నిమిషాలకు గేటు పడుతూ ఉండటంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఒక్కసారిగా వాహనాలు పట్టణంలోకి రానీయకుండా చూడా లని ప్రయాణికులు, వాహనాలు పట్టణంలోకి రానీయకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

పాలకొల్లులో ఇరుకు రోడ్లు..

పాలకొల్లు అర్బన్ : పట్టణంలో మెయిన్ రోడ్డులో వ్యాపారాలతో పాటు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయం కూడా ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. బ్యాంక్ వీధిలో ఐదు బ్యాంకులు ఉండటంతో పాటు మెయిన్‌రోడ్డు నుంచి

పట్టణాలు, కూడళ్లలో పెరిగిపోయిన ట్రాఫిక్ ఇక్కట్లు



పాలకొల్లు పెద్దగోపురం సమీపంలో..

బ్రాడీపేట, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కు వెళ్ళే దారి..లాకుల వద్ద, రైలు గేటు వద్ద ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తగినంత ట్రాఫిక్ పోలీసులు లేకపోవడం, ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు లేకపోవడంతో సమస్య ఎక్కువవుతోంది. చిన్న, చిన్నసందుల్లో వ్యాపార సంస్థలు అధికంగా ఉండటంతో కనీసం ఆటోలు, బైక్‌లు కూడా వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

జాతీయ రహదారి విస్తరించాలి



ఆకివీడులో జాతీయ రహదారి విస్త రించనంత వరకూ ట్రాఫిక్ సమస్య తీరదు. రహదారికి ఇరువైపులా ఆక్రమణ లు పెరిగిపోయాయి.రోడ్లపైనే దుకా ణాలు, తోపుడు బండ్లు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్ళి రావాలంటే నరకం చూస్తున్నాం. ట్రాఫిక్ నియంత్రించడానికి పోలీసులు ఉండరు. పాలకులు పట్టించుకోరు.

దాసరి సోమరాజు, ఆకివీడు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియం త్రణకు చర్యలు చేపట్టాం. జాతీయ ర హదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయద్దని వర్తకులకు చెబుతున్నాం. మోటారు వాహనాలు రోడ్‌పైన నిలుపవద్దని తెలియజేస్తున్నాం. మినీ బైపాస్ రోడ్డు అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

హనుమంతు నాగరాజు, ఎస్ఐ, ఆకివీడు

ఆకివీడులో ఆక్రమణలతో అవస్థలు

ఆకివీడు : ఇరుకు రోడ్లతో నిత్యం ప్రజలు సతమతమవు తున్నారు. జానకమ్మ హస్పటల్ నుంచి ఎఫ్‌సీఐ వరకూ ఉదయం నుంచి రాత్రి వరకూ తరచూ ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీ యరహదారికి ఇరువైపులా ఆక్రమణలకు గురవ్వడంతో పాటు వ్యాపారాలు రోడ్డుపైకి చేరడంతో సమస్యలు పెరిగాయి. రైస్‌మిల్లులు, చేపల ఎగుమతుల లారీలు, కళాశా లలు, పాఠశాలల బస్సుల ట్రాఫిక్ పెరిగిపోయింది. పార్కింగ్ స్థలం లేకపోవడం వ్యాపారాలకు సంబంధించిన సరుకుల లారీలు జాతీయ రహదారిపైనే పెట్టి దిగుమతి చేయడం వల్ల ట్రాఫిక్‌తో జనం నరకం చూస్తున్నారు. రహదారి విస్తరించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతు న్నాయి. పాలకులు సత్వరం చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



ఆకివీడు మెయిన్ రోడ్డులో నిత్యం ఇదే పరిస్థితి..



అసలే ఇరుకు..రోడ్లపైనే పార్కింగ్..

బయటకు రావాలంటే హడల్

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం పట్టణంలో రోజు రోజుకు పెరిగిపోతున్న రద్దీ కారణంగా బయటకు వెళ్ళాలంటే భయపడిపోతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా రహదారుల పక్కనే వాహనాలను పార్కింగ్ చేయడంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. లారీలను పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డు నుంచి మళ్ళిస్తున్నప్పటికి ట్రాఫిక్ రద్దీ మాత్రం తగ్గడం లేదు. శని, ఆదివారాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటున్నది. ఈ రెండు రోజులు ఉల్లి పాయలు, కూరగాయలు, తదితర లోడులతో పెద్ద ఎత్తున లారీలు వస్తుంటాయి. 10 చక్రాల లారీలే ఎక్కువగా రావడంతో అవి ప్రధాన రహదారి నుంచి ఇరుకు సందుల్లో తిరగడానికి చాలా సమయం తీసు కుంటాయి. దీంతో ఆ లారీలు వెళ్ళేంతవరుకూ ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోవాల్సిందే. పట్టణంలో శేష మహల్ థియేటర్ ఉండే రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతం. ఈ రోడ్డులో నాలుగు థియేటర్లు ఉన్నాయి. వ్యాపార సముదాయాలు కూడా ఎక్కువ.సినిమా వదిలిన తరువాత ఈ రోడ్డు నుంచి ప్రధాన రహదారికి రావా లంటే యుద్ధం చేయాల్సిందే. ఈ రోడ్డుకు అనుకుని ఉన్న ఇరుకు సందుల్లో వాహనాలు కూడా ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడంతో నానా అవస్థలు పడాల్సి వస్తోంది. పోలీస్ ఐలాండ్ వద్ద సిగ్నల్ లైట్లు పని చేయక పోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా తమ వాహనాలను నడుపుతున్నారు.



జిల్లా ఆసుపత్రి వద్ద నిలిచిపోయిన వాహనాలు

తణుకులో నిత్య నరకం

తణుకు: పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోయాయి. వాహనాల రద్దీ కారణంగా ప్రజలు తీవ్ర అవస్థలు ఎదు ర్కొంటున్నారు. రాష్ట్రపతి రోడ్డులో ఈ సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. వాణిజ్య వ్యాపార సముదాయాలు, ఆసుపత్రి ఇదే రోడ్డులో ఉండడంతో వాహనాల రాక పోకలతో రహదారి కిక్కిరిసిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సాయంత్రం పాఠశాల బస్సులు, వివిధ కార్మికులు ఒక్కసారిగా రావడంతో రహదారులన్నీ రద్దీ మారుతున్నాయి. రహదారి విస్తరణ జరిగితేనే ట్రాఫిక్ సమస్యలు తీరతాయని పలువురు అంటున్నారు.

మార్టేరులో ఎవరిదారి వారిదే

పెనుమంట్ర : పెనుమంట్ర మండలం మార్టేరు ప్రధాన కూడలిలో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ వ్యూహంలో వాహనదారులు నిలిచిపోయి ముందుకు వెళ్లలేక వెనక్కి వెళ్లలేక ఇరుక్కుపోతున్నారు. రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో పాలకొల్లు- మార్టేరు రహదారి బంద్ చేసి వాహనాలను ఆలమూరు మీదుగా లంకల కోడేరు మళ్ళించారు దీంతో వాహనాల రద్దీ పెరగడం సాయంత్రం అయితే కళాశాల వాహనాలు, స్కూల్ వాహ నాలతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతోంది. ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనాలు ఇష్టారాజ్యంగా రావడంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. అత్యవసర సేవలకు వెళ్లేవారు చిన్నారులు ట్రాఫిక్‌తో అష్టకష్టాలు పడుతున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు మార్టేరు కూడలిలో ట్రాఫిక్ పోలీసు పోస్టు ఏర్పాటు చేస్తే సమస్య కొంతవరకు తీరుతుందని వాహనదారులు చెబుతున్నారు.





గొల్లలకోడేరు శ్మశానవాటిక వద్ద బ్రాందీ షాపు ఏర్పాటు చేయవద్దంటూ ధర్నా చేస్తున్న స్థానికులు

బ్రాందీషాపు వద్దు

పాలకోడేరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు గ్రామంలో పాలకోడేరు పంచా యతీ పరిధిలో ఉన్న స్థలంలో దళితుల శ్మశానవాటిక చేర్చి బ్రాందీషాపు పెట్టడాన్ని నిరసిస్తూ స్థానికులు మంగళవారం ధర్నా చేపట్టారు. దళితుల శ్మశానవాటిక పక్కనే బ్రాందీషాపు ఏర్పాటు చేస్తున్నరన్న సమా చారం అందుకున్న స్థానిక దళితులు కొన్ని రోజులుగా పంచాయతీ అధికారులకు, స్థానిక నాయకులకు, కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తూ వచ్చారు. అయినా సంబంధిత షాపువారు శ్మశానవాటిక చేర్చి మద్యంషాపు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తూనే ఉన్నారు. దీంతో విసుగు చెందిన గ్రామస్థులు ధర్నా చేప ట్టారు. షాపును ఇక్కడ నుంచి తొలగించా లంటూ నినాదాలు చేశారు.

ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే సొమ్ము జమ

ముదినేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నిబంధనలు సరళతరం చేయడంతో రైతులకు వెసులు బాటు కలిగింది. రైతులు ధాన్యం అమ్మకాలకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. కొనుగోలు అనంతరం వెంటనే రైతుల బ్యాంక్ ఖాతాలకు సొమ్ము జమ అవుతోంది. కలిదిండి, ముదినేపల్లి మండలంలో ఈనెల 18 సాయంత్రం కొనుగోలు చేసిన ధాన్యానికి 19 సాయంత్రానికి రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అయింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోపు సొమ్ము చెల్లిస్తామని చెప్పినా 24 గంటల్లోపే జమ కావటం రైతులకు ఆనందం కలిగిస్తున్నది.

తాడేపల్లిగూడెంలో అండర్-13 రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు



తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో ఏపీ స్టేట్ అండర్-13 బాలికల చెస్ పోటీలు మంగళ వారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 160 మంది క్రీడాకారులు హాజర య్యారు. పోటీలను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఆంధ్రా చెస్ అసోసి యేషన్ వైస్‌చైర్మన్ సీహెచ్‌ఏఆర్‌కే వర్మ ప్రారం భించారు. చెస్ పోటీలు క్రీడాకారుల మనో వికాసం పెంచుతాయన్నారు. విద్యలో కూడా ముందుకు వెళ్లవచ్చన్నారు. ఈ పోటీలకు సింగం జానకమ్మ, పట్టాభి ట్రస్ట్ సహకారం అంది స్తుందని ట్రస్ట్ చైర్మన్ సింగం కృష్ణ తెలిపారు. దాట్ల జగన్నాధరాజు, మాజీ కౌన్సిలర్ సింగం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు రామశ్రీకర్ ఎంపిక



ఏలూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల విజయ వాడలో జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ చదరంగం పోటీల్లో ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలకు చెందిన రామశ్రీకర్ ప్రథమ స్థానంలో నిలిచి సౌత్‌జోన్ పోటీ లకు ఎంపిక య్యాడు. ఏలూరు అబ్రహం గ్యారీ క్యాస్పరోవ్ చెస్ అకాడమీ విద్యార్థి అయిన రామశ్రీకర్ చెస్‌లో ప్రతిభ కనబరుస్తున్నాడు. డిసెంబర్ 4 నుంచి 11వ తేదీవరకు చెన్నైలో జరిగే సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఎంపికవడంతో అకాడమి కోచ్ యోహానంద్ అభినందించారు. ఇప్ప టికే రామశ్రీకర్ ఇంటర్నేషనల్ ఫైడ్ రేటింగ్‌లో 1666 సాధించాడు. 2022లో జరిగిన శాప్ టోర్న మెంట్‌లో ప్రథమస్థానంలో నిలిచి అనేక పతకాలు సాధించాడు. నేషనల్ ఛాంపియన్ షిప్‌లో కూడా పాల్గొని నవంబర్ 10వ తేదీన జరిగిన కోనసీమ ఓపెన్ స్టేట్‌చెస్ ఛాంపియన్ షిప్‌లో 28వ స్థానంలో నిలిచాడు. తాజాగా సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఎంపికవడం పట్ల పలువురు చెస్ క్రీడాకారులు అభినందించారు.



విజేతలకు మెమెంటోలు అందించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషుల దినోత్సవం

ఏలూరు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంత ర్జాతీయ పురుషుల దినోత్సవం మంగళవారం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసో సియేషన్ భవనంలో ఘనంగా నిర్వహించారు. బార్ అధ్యక్షుడు, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్ అధ్యక్షతన కొనసాగిన ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ విచ్చేశారు. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలైన వారికి మెమెంటోలను, బహుమతులను అందించారు. సీనియర్ న్యాయవాదులు నందకుమార్, ఎస్‌వీ ఆర్ గాంధీ, రామానుజాచార్యులను సన్మానిం చారు. బార్ ఉపాధ్యక్షుడు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి చింతమనేని రమేష్ పాల్గొన్నారు.



దీపాలతో బాలాత్రిపుర సుందరీకి అలంకారం.. దీపాలు వెలిగించుకుంటున్న మహిళలు

మెంటే వారి తోటలో కార్తీక దీపోత్సవం

భీమవరంటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మెంటేవారి తోటలో ఉన్న విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి కార్తీక దీపో త్సవం నిర్వహించారు.ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మ వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. అనంతరం వందలాది మహిళ భక్తులచే మహాలింగార్చన, జ్యోతి లింగార్చన, శివ పార్వ తుల అర్చన, కార్తీకదీపోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గునుపూడి సోమేశ్వర స్వామికి అష్టోత్తర దీపాలంకరణ



భీమవరం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మంగళవారం, ఆరుద్ర నక్ష త్రం పురస్కరించుకుని గునుపూడి సోమేశ్వ రస్వామికి అష్టోత్తర దీపాలంకరణ చేశారు. ఆ లయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వ ర్యంలో తెల్లవారుజామున అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం విశేషపూజలు చేసిన అనంతరం స్వామివారిని అష్టోతర దీపాలతో అలంకారం చేశారు. ఆలయ ఈవో రామకృష్ణంరాజు పర్యవేక్షించారు.



భీమవరం మావుళ్లమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది.. ప్రకాశం జిల్లా నుంచి పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



అంతర్జాతీయ ప్రదర్శనకు వెంపటాపు చిత్రాలు

తణుకు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జర్మనీ దేశం బెర్లిన్‌లో జరిగే అంతర్జాతీయ చిత్ర కళా ప్రదర్శనలో ప్రముఖ చిత్ర కారుడు వెంపటాపు చిత్రాలను ప్రదర్శించ నున్నారు. తెలిపారు.మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెర్లిన్ ఫైన్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ అరౌండ్ ది వరల్డ్- 2024 పేరిట జర్మనీ దేశం బెర్లిన్‌లో ఈనెల 20 నుంచి మూడు వారాల పాటు జరిగే చిత్ర కళా ప్రదర్శనలో తనకు స్థానం దక్కింద న్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నికైన యాభై మంది చిత్రకారుల కళాకండాలు ఇక్కడ ప్రదర్శిస్తారన్నారు.



క్షీరా రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న విద్యుత్ చైర్మన్

పాలకొల్లు అర్బన్, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : క్షీరా రామలింగేశ్వరస్వామిని ఏపీఈ ఆర్‌సీ (విద్యుత్ శాఖ) చైర్మన్ ఠాకూర్ రామ సింహా, సభ్యులు వెంకటరామరెడ్డి, మంగళ వారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి ఆలయ మర్యాద లతో స్వాగతం పలికారు. స్వామివారికి, అమ్మ వారికి పూజలు అనంతరం అర్చకులు వేదా శీర్వచనం అందించారు. ఎస్ఈ రఘునాథ్ బాబు, నరసాపురం డీఈ మధుకుమార్, పాల కొల్లు పట్టణ ఏడీ రామకృష్ణ పాల్గొన్నారు.

రైళ్ల దారి మళ్లింపు



ఏలూరు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు మీదుగా వెళ్తున్న రైళ్లలో కొన్ని రైళ్లను దారిమళ్లించడం వల్ల ఏలూరు, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లలో సంబంధిత స్టాప్ ఉండదని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ప్రకటించారు. గన్నవరం, ముస్తాబాదు, చేబ్రోలు సెక్షన్ పరిధిలో ట్రాఫిక్ మెయింటినెన్స్ నిర్వహిస్తున్న నేపథ్యంలో రైళ్లను ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా కాకుండా విజయవాడ, గుణదల, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా వెళ్తాయని తిరిగి నిడదవోలు, భీమవరం టౌన్, గుణదల, విజయవాడ మీదుగా వెళ్తాయన్నారు.

దారి మళ్లించే రైళ్లు ఇవే

రైల్ నెంబర్ 13351 ధన్‌బాగ్ - అల్ఫుజా ఈనెల 19 నుంచి 23 వరకూ 25 నుంచి 30 వరకూ దారి మళ్ళింపు. 18111 టాటా - యశ్వంత్‌పూర్ ఈనెల 21, 28 తేదీలలో దారిమళ్ళింపు, 12376 జాసిద్ -తాంబ్రమం ఈనెల 20, 27 తేదీలలో దారిమళ్ళింపు, 18637 హట్యాయ్ - ఎస్ఎంవి బెంగళూరు ఈనెల 23, 30 తేదీలలో దారిమళ్ళింపు, 12889 టాటా -ఎస్ఎంవి బెంగళూరు ఈనెల 22, 29తేదీలలో దారి మళ్ళింపు, 22837 హట్యాయ్ - యర్నాకుళం ఈనెల 25వ తేదీన దారి మళ్ళింపు, 12835 హట్యాయ్ - ఎస్ఎంవి బెంగళూరు ఈనెల 19, 26 తేదీలలో దారి మళ్ళింపు, 18503 విశాఖపట్నం - శిర్డిసాయినగర్ ఈనెల 28వ తేదీన దారి మళ్ళింపు, 12803 విశాఖపట్టణం - హజరత్ నిజాముద్దీన్ ఈనెల 29వ తేదీన దారి మళ్ళింపు ఉంటుంది.

భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలి

ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు విపరీతంగా పెరిగాయని, వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ఈవిషయంపై మాట్లాడారు. భీమవరం నియోజకవర్గంలో రిజిస్ట్రేషన్ చార్జీలు విపరీతంగా పెరిగాయని, రూ.40 లక్షల విలువ కలిగిన అగ్రికల్చర్ ల్యాండ్ రూ.కోటి 70 లక్షలకు పలుకుతుందని, భీమవరంలో రూ.2 కోట్లు ఉండే పొలాన్ని రూ.10 కోట్లకు పెంచేశారని పేర్కొన్నాన్నారు. దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని, వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అంజిబాబు కోరారు.

ఓపెన్ ఎయిర్ థియేటర్ పనులు పూర్తి చేయాలి



ఎమ్మెల్సీ వంకా రవీంద్ర

నరసాపురం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): నరసాపురం పురపాలక సంఘం పక్కన నిర్మిస్తున్న ఓపెన్ ఎయిర్ థియే టర్ పనులపై మంగళవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ వంకా రవీంద్ర ప్రశ్నించారు. ప్రజల సౌకర్యార్థం రూ.2.50 కోట్లతో పనులు చేపట్టారు. మధ్యస్థంగా నిలిచిపోయాయి, దీనికి నిధులు కేటాయించాలని మండల సభ దృష్టికి తీసుకొచ్చారు.

యూత్ హాస్టల్స్‌ను ప్రోత్సహించాలి



ట్రోఫీని అందిస్తున్న యూత్ హాస్టల్స్ రాష్ట్ర అధ్యక్షుడు సోమరాజు

భీమవరం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞానం, వినోదంతో పాటు యువతకు శారీరక పరిపుష్టికి, మానసిక ఉల్లాసానికి యూత్ హాస్టల్స్ ఉద్యమాన్ని ప్రోత్సహించాలని యూత్ హాస్టల్స్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సోమరాజు అన్నారు. మంగళవారం 2023-24సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా వున్న 400 యూత్ హాస్టళ్ళల్లో భీమవరం యూనిట్ ఉత్తమ యూనిట్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా భీమవరం యూనిట్ సభ్యులను ఆయన అభినందించి మాట్లాడారు. దక్షిణభారత దేశంలోనే భీమవరం రెండవ అతిపెద్ద యూనిట్‌గా గుర్తింపు తెచ్చుకున్నదని తెలిపారు. భీమవరం యూనిట్ వరుసగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలుగా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈసందర్భంగా యూనిట్ అధ్యక్షుడు మంతెన వెంకట నరసింహ సీతా రామరాజు (చిలుకూరి నరసింహ రాజు)కు డాక్టర్ సోమరాజు తన కార్యాలయంలో అవార్డును అందించారు. ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ, కార్యదర్శి నందమూరి రాజేష్‌లను అభినందించారు.



ద్వారకాతిరుమలలో అనాథలతో కలసి సిద్ధార్థ

22 మంది అనాథలకు శ్రీవారి దర్శనం

ద్వారకాతిరుమల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని ఓ సామాజిక సేవ కార్యకర్త 22మంది అనాథలతో వచ్చి దర్శించుకున్నారు. విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గం వావిలవలస గ్రామానికి చెందిన రాహుల్ సౌరబ్ అనాథాశ్రమం నిర్వహిస్తున్న పాలూరి సిద్ధార్థ దేవదాయ కమిషనర్ సత్యనారాయణ సహకారంతో ఆలయ దర్శనాలు చేసుకుంటున్నారు. ఈక్రమంలో మంగళవారం ద్వారకాతిరుమల శ్రీవారిని దర్శించుకోగా వారికి ఆలయ ఈవో మూర్తి అన్ని ఏర్పాట్లు చేశారు. దైవదర్శనం చేసుకునే కోరికను అనాథలకు తీర్చిన తృప్తిని ఆస్వాదిస్తున్నట్లు సిద్ధార్థ చెప్పారు.

సేవానంది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగురాష్ట్రాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వైద్యులు, ఉపాధ్యాయులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని సేవానంది, సేవా భూషణ్-2024 జాతీయస్థాయి పురస్కారాలతో సత్కరించేందుకు ఉమ్మడిపశ్చిమగోదావరిజిల్లాలోని సంబంధిత సేవా దృక్పథం గల వ్యక్తుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైనవారికి డిసెంబరు 8న హైద్రాబాద్‌లో నిర్వహించే వేడుకలో అవార్డులను అందజేస్తామన్నారు. సంబంధితరంగాల్లో విశిష్టసేవలందించినవారు వారి సేవలు, ప్రతిభను గురించి తెలియజేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతోపాటు, 4 పాస్‌పోర్టుసైజు ఫొటోలను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 30లోగా కార్యాలయ చిరునామా ' ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నెంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15' కు పంపాలని సూచించారు. వివరాలకు ఫోన్‌నెంబరు 96523 47207లో సంప్రదించాలని కోరారు.

దోమకాటు ప్రమాదకరం



గుడివాకలంకలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దోమకాటు ప్రమాదకరమని, దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామంలో జరుగుతున్న వ్యాధుల సర్వే కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్య, ఆశాకార్యకర్తలు నిర్వహిస్తున్న ఇంటింటా క్యాన్సర్, షుగర్, బి.పి, దంత సమస్యలపై సమాచారం ఇవ్వాలని, అప్పుడే వ్యాధులను గుర్తించగలమన్నారు. సకాలంలో గుర్తిస్తే వైద్యచికిత్స సులభం అవుతుందన్నారు. శీతాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు దోమలు వృద్ధిచెందకుండా వారానికి ఒకసారి డ్రైడేడ్రైడే ఆచరించాలని సూచించారు. వైద్య అధికారి ఆనంద్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఆనంద్, మలేరియా హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు మౌనిక, విజయకుమారి పాల్గొన్నారు.

బరి తెగించారు!

» ఇసుక దోపిడీ ఆగలేదు » దళారులకు ప్రజా ప్రతినిధుల ఊతం » నాయకులకు టన్నుకు రూ.150
» రీచ్‌లలో లారీ ఇసుకకు రూ. 8000 » పాత ప్రభుత్వంలో ఉన్న వ్యక్తికి ప్రజాప్రతినిధుల పగ్గాలు



పాలకొల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారినా... ప్రభుత్వం మారినా నేతల తీరు మారలేదు. ఇసుక దోపిడి ఆగలేదు. కష్టాలు తీరలేదు. ఇసుకాసురులు బరితెగించారు. ఇపుడు దళారులకు పలువురు ప్రజా ప్రతినిధులు దోపిడికి ఊతమిస్తున్నారు. రాజమండ్రి, రాజమండ్రి రూరల్, కొవ్వూరు ప్రాంతాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు నేరుగా ఇసుక దోపిడిలోకి వచ్చేశారు. టన్నుకు 150 రూపాయలు చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేశారు. పాత తూర్పు పశ్చిమలో జగన్ రెడ్డి ప్రభుత్వంలో గుంటూరు ప్రాంతానికి చెందన ఆర్‌కె అనే వ్యక్తి ఈ రెండు జిల్లాలోనూ ఇసుక దందా కొనసాగించారు. అప్పట్లో ఈ వ్యక్తి ద్వారా జగన్ పేషీకి నెలకు రూ.11 కోట్లు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకుని ఆ మేరకు దందా కొనసాగించారని అప్పట్లో విస్తృత ప్రచారం జరిగింది.

పడవ ర్యాంప్‌లలో ఐదు యూనిట్లకు రూ. 4,580 వసూలు చేస్తున్నారు. దీనితో పాటు టన్నుకు పడవ కార్మికులకు రూ.200 చొప్పున చెల్లిస్తారు. వీటితో పాటు 20 టన్నుల ఇసుక (ఐదు యూనిట్ల ఇసుక) టన్నుకు రూ.150 చొప్పున రూ.3 వేలు దళారులకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తంలో గుంటూరుకు చెందిన వ్యక్తి దందా చేస్తూ కొంత కమిషన్ తీసుకుని మిగిలిన మొత్తాన్ని ఎప్పటికపుడు ప్రజా ప్రతినిధులకు అందించే విధంగా ఒప్పదం చేసుకున్నట్లు సమాచారం.

లారీలు ర్యాంప్‌లలోకి వెళ్ళి ఎగుమతి చేసుకునే అవకాశం ఉన్న ర్యాంప్‌లలోసైతం లారీకి రూ. 8 వేల నుంచి 10 వేలు వసూలు చేస్తున్నారు. ఈ ఇసుక లారీల్లో వినియోగదారుడి ఇంటికి చేరేసరికి రూ.20వేలు ఖర్చు అవుతున్నది. తీపర్రులో ర్యాంప్‌లో నీరు రావడంతో రెండు రోజులుగా ఎగుమతులు ఆగాయి. పెండ్యాల, పందలపర్రు ర్యాంప్‌లలో ట్రాక్టర్‌లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎగుమతి చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ట్రాక్టర్‌లు ర్యాంప్‌లోకి నేరుగా వెళ్ళి ఇసుక తెచ్చుకోవచ్చునని ప్రకటించడంతో దానిని అలుసుగా తీసుకుని రోజుకు 200 నుంచి 300 ట్రాక్టర్‌లకు ఇసుక అందజేస్తున్నారు. ట్రాక్టర్‌లు ఇసుకకు అధికారికంగా రూ.200 ఖర్చు చెబుతూ మరో 800 దళారులు నొక్కేస్తున్నారు. ఈ ర్యాంప్‌లలో సైతం లారీలకు ఎగుమతి చేయడం లేదని లారీ యజమానులు చెబుతున్నారు.

ఉభయ పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఇప్పటికి ఇసుక కష్టాలు తీరలేదు. ఐదు యూనిట్ల ఇసుక రూ.20 వేలు పైబడి అమ్ముతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గత ఏడాది ఇదే రోజులలో లారీ ఇసుక రూ.13వేల నుంచి 15 వేల మధ్యలోలభించేది. ఇపుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఇంకా ర్యాంప్‌లు సిద్ధం కానందున జిల్లా అవసరాలకు రోజుకు వంద లారీలు ఇసుక ఇమ్మని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు మాటలు సైతం దళారులు లెక్క చేయడం లేదు. ఇపుడు నేరుగా ప్రజా ప్రతినిధులే ఇసుక అక్రమ అమ్మకాలకు తెరతీయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

సీఎం హెచ్చరికలు బేఖాతర్

ఇసుక అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని సీఎం చంద్రబాబు చెబుతుండగా అదే పార్టీకి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు ఇసుకను అమ్మి బొక్కేద్దామని చూడటం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి ఇసుక వ్యవహారం తలనొప్పిగా మారనుంది. వివిధ పథకాలకు సొమ్ములు ఏ నెలకు ఆ నెల వెతుక్కునే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉండగా ఇసుక లొల్లి ప్రభుత్వానికి తలపోటుగా మారింది. ప్రభుత్వ పెద్దలు ఇసుక అక్రమాలపై దృష్టి సారించాలని నియోజకవర్గాల వారీగా కూటమి శ్రేణులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటినప్పటికి ఇసుక సరఫరా మెగరుపడినప్పటికి ఇంకా అదే కష్టాలు కొనసాగుతుండటం ఉచితంగా తవ్వి తెచ్చుకునే ఇసుకను వేలాది రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకోవడం పట్ల మేధావి వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం దృష్టి పెట్టి సంబంధిత శాఖను అప్రమత్తం చేసి సొంత పార్టీకి చెందినవారైనా హద్దు దాటితే శిక్షించాలని వినియోగదారులతోపాటు సామాన్య పౌరులు కోరుతున్నారు

క్రైమ్ కార్నర్

ప్రేమ పేరుతో యువతిపై అత్యాచారం

ఏలూరు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న యువతి(17)కి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఒక యువకుడు ఆ పరిచయాన్ని ప్రేమగా మార్చి ఆ తరువాత పెళ్ళి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఈ సంఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు మంగళ వారం రాత్రి కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం ఒక గ్రామానికి చెందిన యువతి (17) ఏలూరులోని ఒక కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువు తున్నది. రెండున్నర సంవత్సరాల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో గుంటూరు జిల్లా లింగయ్య పాలెంకు చెందిన కూచిపూడి రాజేష్ (22) పరిచయం అయ్యాడు. ఆ పరిచయం కాస్త ప్రేమగా మార్చుకున్నాడు. పెళ్ళి చేసుకుంటా నని ఆమెను నమ్మించి గత నెల 18వ తేదీన ఏలూరు రూరల్ మండలంలోని ఒక గ్రామా నికి వచ్చి ఆ యువతికి మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ ఆ యువకునిపై అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాడు.

గిరిజనుల మధ్య భూ తగాదా

పోలవరం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం వింజరం పంచాయతీ తానాలకుంట గ్రామంలో మంగళవారం గిరిజనుల మధ్య భూతగాదా జరిగింది. పోలవరం ఎస్ఐ ఎస్.పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తానాల కుంట గ్రామానికి చెందిన కెచ్చెల భీమారెడ్డి, కెచ్చెల ముక్కారెడ్డిలు పొలంలో పని చేస్తుండగా పోతింటి వెంకటరెడ్డి, పోతింటి రామకృష్ణారెడ్డి, అరగంటి జోగిరెడ్డి, పాములేటి పెంటారెడ్డి అనే వ్యక్తులు ఆ పొలం తమదని దౌర్జన్యానికి పాల్పడి గాయపరిచినట్లుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భీమవరంలో బంగారం రికవరీలు

భీమవరం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని కొన్ని బంగారు దుకాణాల్లో పోలీసులు తనిఖీలతో వ్యాపారులు కంగారు పడ్డారు. పాలకొల్లుకు సంబంధించిన పోలీసులు ఒక దొంగను తీసుకువచ్చి కొంత బంగారం, నగదు రికవరీ చేసినట్లుగా తెలిసింది. సోమవారం రాత్రి పోలీసులు రెండు బృందాలుగా రావడంతో అస్సలు ఏం జరుగుతుందో అని వ్యాపారులకు అర్థం కాలేదు. మార్వాడి సందు, మెయిన్ రోడ్‌లలోని దుకాణాల్లో రికవరీ చేసుకుని వెళ్ళినట్లు చెబుతున్నారు. అయితే పోలీసులు మాత్రం వివరాలు చెప్పకుండా వెళ్ళిపోయారు.

బట్టలు వ్యాపారి పరారీ

భీమవరం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు ఎంతో నమ్మకంగా ఉంటూ వారిని నమ్మించి మోసగించిన ఒక బట్టల వ్యాపారి దుకాణం మూసివేసి పరారైన సంఘటన భీమవరంలో సంచలనమైంది. భీమవరం మెయిన్ రోడ్డుకు ఒక థియేటర్ ఎదురుగా ఉన్న బట్టల వ్యాపారి రెండు రోజులుగా షాపు తెరవడం లేదు. అలాగే పట్టణంలో కూడా కనబడకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా షాపు వద్దకు వచ్చి ఆరా తీస్తున్నారు. సుమారు రూ.3 కోట్లు పైనే బకాయిలు ఉన్నట్లుగా చెబుతున్నారు. గతంలో ఖాతాదారుల ఇళ్ళకు వస్త్రాలు తీసుకువెళ్ళి వారిని ఎంతగానో నమ్మకం కల్గించిన వ్యక్తి వారి వద్ద డబ్బులు వసూలు చేసి పరారైనట్లుగా ప్రచారం జరుగుతున్నది.

పోక్సో నేరస్థులపై ప్రత్యేక నిఘా: ఐజీ

ద్వారకాతిరుమల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు ఒడిగట్టే పాత నేరస్తులపై రౌడీ షీట్లను ఓపెన్ చేసి ప్రత్యేక నిఘా పెడతామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ద్వారకాతిరుమల పోలీస్టేషన్‌ను ఆయన ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్‌తో కలసి తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను, క్రైమ్ రేటును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీవారి ఆలయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకున్నట్లు ఐజీ చెప్పారు. ఆలయం ఇప్పటికే సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉందని అదనంగా మరికొన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

శ్రీవారి సేవలో ఐజీ

చినవెంకన్న ఆలయాన్ని ఐజీ అశోక్‌కుమార్ సందర్శించారు. ఆలయానికి తొలిసారిగా ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్‌తో కలసి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం అర్చకుల నుంచి శ్రీవారి శేషవస్త్రం, ఆశీర్వచనం పొందారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

భీమడోలు: భీమడోలు సర్కిల్ పరిధిలో జాతీయ రహదారులు ఉన్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఈ మేరకు సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు ఇచ్చామని ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా భీమడోలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్, డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల పోలీస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఐజీ అశోక్ కుమార్

హోటళ్లపై విజిలెన్స్ దాడులు

నిల్వ ఉన్న మాంసం, కృత్రిమ రంగులు గుర్తింపు



హోటళ్ళల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఏలూరు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 16వ నెంబర్ జాతీయ రహదారి వెంబడి ఉన్న ఫుడ్‌కోర్టులు, హోటళ్ళపై విజిలెన్సు అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. దెందులూరు మండలం శింగవరం గ్రామం వద్ద 16వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న గరుడ ఫుడ్‌కోర్టులో తనిఖీలు నిర్వహించారు. అక్కడ కృత్రిమ రంగులు కలుపుతున్నారని వచ్చిన ఫిర్యాదులో ఆహారపదార్థాల నమూనాలను సేకరించారు. అంతే కాకుండా నిల్వ ఉంచిన మాంసాహారాన్ని గుర్తించారు. వాటిని ల్యాబ్‌లకు పంపించను న్నట్లు వెల్లడించారు. గరుడ ఫుడ్‌కోర్టులో లైసె న్సులేని రెండు ఎలక్ట్రానిక్ తూనికల యంత్రా లను గుర్తించి సీజ్ చేశారు. కేఎఫ్‌సీ ఫుడ్‌కోర్టులో లైసున్సు లేనటువంటి ఒక ఎలక్ట్రానిక్ తూనికల యంత్రం గుర్తించి సీజ్ చేశారు. పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేటు వద్ద నిర్వహిస్తున్న మురుగన్ హోటల్‌లో తనిఖీ చేసి నిల్వ ఉంచిన మాంసాహార పదార్థాలను గుర్తించారు. కృత్రిమ రంగులు కలిపినట్లు నమూనాలు ఉండడంలో వాటిని సేకరించి ల్యాబ్‌నకు పంపించారు. మురుగన్ హోటల్‌లో లైసెన్సులేని ఒక ఎలక్ట్రానిక్ తూనికల యంత్రాన్ని గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, విజిలెన్సు ఏజీ పి శ్రీధర్, విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు, విజిలెన్స్ కానిస్టేబుల్ వీబీ దుర్గారావు, లీగల్‌మెట్రాలజీ అధికారి వి ప్రశాంత్‌కుమార్, ఆహార పదార్థాల తనిఖీ అధికారి రామరాజు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు: ఇద్దరి అరెస్టు



నూజివీడు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 20 మద్యం సీసాలు స్వాధీన పరుచుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నూజివీడు మండలం సుంకొల్లు గ్రామానికి చెందిన పల్లెపాం సుదర్శన్ రావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 14 మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నట్లు ఆయన తెలిపారు. ఆగిరిపల్లికి చెందిన పరసా కొండలరావును అదుపులోకి తీసుకుని అతనివద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై బి.రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

నూజివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. చాట్రాయి మండలం చాట్రాయిలో భూమిలో పాతిపెట్టబడిన 28 ప్లాస్టిక్ డ్రమ్ములను వెలికితీసి వాటిలో నిల్వ ఉంచిన 2,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు బెల్లపుఊటను నిల్వఉంచిన నల్గొండ జిల్లా వెంకతురం గ్రామానికి చెందిన బానోతు రాజును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చంద్రుపట్ల తండాకు చెందిన బాణావతు కృష్ణను, కలగర తండాకు చెందిన అజ్మీరా శ్రీనుపై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంటిని దోచేశారు..

ఉండి నవంబరు 19(ఆంధ్రజ్యోతి):పాందువ్వ గ్రామంలో చోరీ చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన అల్లూరి రవికుమార్ అనే వ్యక్తి హైదరాబాద్‌లో సాఫ్టవేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇటీవల ఇంటి వద్ద వుండి విధులు నిర్వహిస్తున్నాడు పిల్లలకు పరీక్షలు వుండడంతో ఈనెల 15వ తేదీన హైదరాబాద్ వెళ్లి తిరిగి 18వ తేదీ పాందువ్వ గ్రామానికి చేరుకున్నారు. ఇంటికి వచ్చేసరికి తలుపుల తాళాలు తీసి వుండడం, లోపాల బీరువా తీసి వుండడం చూసి ఆందోళన చెందారు. బీరువా పగులగొట్టి అందులోని రూ.50వేల నగదు, ఇంట్లోని రు.45వేలు విలువైన వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాధవరంలో తేనె టీగల దాడి

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాధవరంలో తెనెటీగల దాడితో వాహన చోదకులు గాయాల పాలయ్యారు. గాయాల పాలైన వారిలో విద్యార్థులు కూడా ఉన్నారు. మాధవరం నుంచి కంసాలి పాలెం వెళ్లే వంతెన సమీపంలో తేనేటీగలు చెలరేగి అటుగా వెళ్తున్న విద్యార్థులపై దాడి చేశాయి. వారితోపాటు కుంచనపల్లికి చెందిన మండపాక భుజంగభూషణరావుపై దాడి చేయగా స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అక్కడ నుంచి తాడేపల్లిగూడెం ఏరియా ఆసు పత్రికి తరలించారు. విద్యార్థులు నిడదవోలు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పినట్లు సమాచారం. రెండు రోజులుగా ఆ ప్రాంతంలో తెనెటీగలు దాడిచేస్తుండటంతో అంతా బెంబేలెత్తి పోయారు. దీంతో స్థానిక రైతులు ఆ తేనెటీగల పుట్టకు పొగపెట్టి తొలగించారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



వెంకట్రావు (ఫైల్ ఫొటో)

ముదినేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలపర్రు గ్రామంలో ఒక వ్యక్తి చేపల చెరువులో అనుమానాస్పద స్థితి లో శవమై తేలాడు. గ్రామానికి చెందిన సంకు రాత్రి వెంకట్రావు (48) భార్య, కుమారుడిని వదిలి ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 15న కూలి పనులకు వెళ్లిన వెంకట్రావు యజమాని వద్ద సొమ్ములు తీసుకుని వెళ్లి అదేరోజు రాత్రి నుంచి కనిపించలేదు. ఈ నెల 16 ఉదయం నుంచి కొంతమంది అతడి కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం రాత్రి 9 గంటలకు గ్రామ సమీపంలోని ఒక చేపల చెరువులో శవమై కనిపించాడు. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించా రు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీఎస్. వీరభద్రరావు తెలిపారు.

బోదెలోకి దూసుకు పోయిన ట్రాక్టర్

పెనుగొండ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం వెంకట్రామపురం వద్ద ఇటుకలోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఒక్కసారిగా ట్రక్కు కు ఉండే పిన్ను ఊడిపోవడంతో సుమారు వంద మీటర్లు దూసుకెళ్లిపోయింది. ఆ తర్వాత రహదారి పక్కనే ఉన్న పంట బోదెలోకి తిరగబడింది. ట్రాక్టర్‌పై నలుగురు జట్టు కార్మికులు ఉండగా ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. జట్టు కార్మికులు తూర్పుగోదావరి జిల్లా ఖండవల్లి గ్రామానికి చెందిన వారు అని సమాచారం.

గ్యాస్ సొమ్ము జమ కాకుంటే ఫోన్ చేయండి

ఏలూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకం కింద మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ కోసం 2025 మార్చి 31వ తేదీ వరకు గడువు ఉందని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజు తెలిపారు. అర్హులైన గ్యాస్ వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్ పొంది సబ్సిడీ సొమ్ము 48 గంటలు గడచినా వారి బ్యాంకు ఖాతాకు సొమ్ము జమ కాని పక్షంలో తమ వివరాలు టోల్ ఫ్రీ నంబర్ 1800-425-6453కు తెలియజేస్తే సొమ్ము జమయ్యేలా చూస్తామన్నారు.

బాలికల సమస్యలపై 1098కు తెలపండి

ద్వారకాతిరుమల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలకు ఎటువంటి సమస్యలున్నా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు తెలియజేయాలని జిల్లా బాలల సంరక్షణ కార్యాలయ ప్రొటెక్షన్ అధికారి సీహెచ్ శ్రీకాంత్ కోరారు. మండలంలోని పంగిడి గూడెం అంగన్వాడీ కేంద్రంలో మహిళలు, యువతులకు బాలల హక్కుల చట్టం, దత్తత చట్టంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల హక్కులు, బాల్యవివాహ నిరోధక చట్టం వంటి పలు అంశాలపై వివరించారు. సిబ్బంది రాజేష్, మేరి, లక్ష్మీరాజ్యం, నవీన, దుర్గా, సుందరి, సింధు, శైలజ, సుమతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాసగిరి



దెందులూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ పాఠశాలల టీచర్ల సంఘం ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపన్న పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాసగిరి శ్రీనివాసరావును నియమిస్తూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు స్టీవెన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, తెలుగు బాషా భివృద్ధికి కృషి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, ప్రసాద్, వర్ల గంధర్వరావు ఆయనను సన్మానించారు.

ఇంటర్ బోర్డు ఆర్ఐవోకు ఫిర్యాదు

ఏలూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యాశాఖ అనుమతులులేకుండా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో నాగార్జున వర్సిటీ దూరవిద్య పరీక్షలు నిర్వహిస్తుండటంపై పీడీఎస్‌యు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కె.నాని, డి.శివ మంగళవారం స్థానిక ఇంటర్‌బోర్డు ఆర్ఐవో చంద్రశేఖరబాబుకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నందున వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కళాశాల వద్దే ఆందోళనచేపడతామని ఆర్ఐవోకు తెలియజేశామని సంఘ నాయకులు సునీల్‌కుమార్, లారెన్స్, షేక్ అఫ్రోజ్ వివరించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏలూరు డెంటల్ కళాశాలలో విద్యనభ్యసిస్తూ ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్న యువతి ఈ నెల 18 నుంచి కనిపించటం లేదని, ఆమె తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎస్.కె జబీర్ తెలిపారు. స్పెషల్‌క్లాస్ ఉందని, ఆర్టీసీ బస్సు పై ఏలూరు బయల్దేరి వెళ్ళి ఆ తరువాత ఫోన్ స్విచ్ఆఫ్ చేసినట్లు యువతి తండ్రి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు

చింతలపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కళ్ళచెరువు గ్రామంలో బెల్టు షాపు నిర్వాహకుడు జుత్తిగ ప్రసాద్ నుండి 180 ఎంఎల్ పది డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. వడ్లపట్ల నూతనంలో పాత సారా కేసులో నిందితురాలు పామర్తి వెంకటలక్ష్మిని కామవరపుకోట తహసీల్దారు వద్ద హాజరుపరిచి బైండోవర్ నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల పట్టివేత

పెదపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్లవ్యర్థాలను తరలిస్తుండగా సిబ్బందితో కలిసి దాడి చేసి మూడు ఐషర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహన, చెరువు యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి చికెన్ వ్యర్థాలను భూమిలో పూడ్చి పెట్టించినట్లుగా చెప్పారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి అరెస్టు.. బంగారు నగ స్వాధీనం

లింగపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాజీగూడెంలోని ఒక ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు పగలగొట్టి ఆ ఇంట్లోని ఐదు కాసుల బంగారు నల్లపూసలతాడును దొంగిలించుకుపోయిన అదే గ్రామానికి చెందిన మేకల హరిగోపాల్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. గత రెండు నెలల క్రితం నేరం చేసి తప్పించుకుతిరుగుతున్న నిందితుడు హరిగోపాల్ ను అరెస్టు చేసి అతని నుండి ఐదు కాసుల బంగారు నల్లపూసలతాడు ను స్వాధీనం చేసుకుని రిమాండుకు పంపినట్లు ఎస్సై తెలిపారు.

నరకయాతన



మట్టి రోడ్డుగా మారిపోయిన అలివేరు తారురోడ్డు

రాళ్లు లేచిపోయిన రహదారితో పాట్లు

అధికారులు పట్టించుకోవడం లేదన్న కొండరెడ్లు

బుట్టాయగూడెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్లుగా రహదారి విషయమై మన్యం బిడ్డలు గొంతు చించుకుంటున్నా ఇప్పటివరకు కన్నెత్తిచూసిన అధికారులంటూ లేరంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గతంలో కొండరెడ్డి గ్రామానికి బీటీ రోడ్డును వేసిన అధికారులు తర్వాత కాలంలో మరమ్మతులు మరచిపోవడంతో 9 గ్రామాలకు చెందిన కొండరెడ్లు నిత్యం నరకాన్ని చూస్తున్నారు. తారురోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారడమే కాక ఆ రోడ్డుపై ప్రయాణాలంటేనే వణికిపోతున్నారు. అటవీ ప్రాంతంలోని అలివేరు, అంకపాకల, రేపల్లె, రేగులపాడు, డోలుగండి, గొట్టాలరేవు, గానుగమామిడి, మోదేలు, నిమ్మలపాడు కొండరెడ్లకు ఇదే ప్రధాన రహదారి. బయట ప్రాంతాలకు రావాలంటే ఇదే మార్గం. సుమారు 25 ఏళ్ల క్రితం కెఆర్ పురం ఐటిడిఏ ఇంజనీరింగ్ శాఖ దొరమామిడి డ్యామ్ నుంచి 7 కిలో మీటర్ల దూరంలో ఉన్న అలివేరు కొండరెడ్డి గ్రామం వరకు బీటీ రోడ్డు వేసింది. అంతే అప్పటి నుంచి అధికారులు దాని బాగోగులను ఇప్పటివరకు పట్టించుకోలేదు.

రోడ్డు వేసి 25 ఏళ్లు దాటింది



రోడ్డు వేసి 25 ఏళ్లు దాటింది. అధిక వర్షాలు కారణంగా కొండల పక్కనే నిర్మించిన బీటీ రోడ్డు అనతికాలంలోనే పాడైంది. అధికారులు స్పందించి పాడైపోయిన 7 కిలో మీటర్ల రోడ్డును బాగుచేస్తే 9 గ్రామాల కొండరెడ్లు ఆనందపడతారు.

-కరకాల లచ్చిరెడ్డి, అలివేరు

రాష్ట్రాన్ని పట్టాలెక్కిస్తున్న కూటమి



మంత్రి సారథిని సత్కరిస్తున్న ఆలయ ఈఓ చందన

జంగారెడ్డిగూడెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అధోగతిపాలైన రాష్ట్రాన్ని పట్టాలెక్కించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామిని మంత్రి దర్శించుకున్నారు. ఈఓ చందన స్వామి వారి శేష వస్త్రాలతో ఆయనను సత్కరించి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించి యువతకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును కేంద్రం సహకారంతో త్వరితగతిన పూర్తిచేస్తుందని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడమే కాక భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు, ఇళ్ళను ఇవ్వడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనలు పంపమన్నారని తెలిపారు. 2025 సంక్రాంతి కి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, మాజీ డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, చక్రదేవరపల్లి సర్పంచ్ సాయిల సత్యనారాయణ, రావూరి కృష్ణ, కొండ్రెడ్డి కిషోర్, క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి గుర్తింపు

పనిచేసే కార్యకర్తలను అధిష్టానం తప్పక గుర్తిస్తుందని మంత్రి అన్నారు. మంగళవారం మద్దిఆంజనేయ స్వామి వారి దర్శనానికి వచ్చిన మంత్రిని ఇటీవల రాష్ట్ర శెట్టిబలిజ కార్పోరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు,రాష్ట్ర క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు మర్యాద పూర్వకంగా మంత్రి ని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు.



పాతూరు ఎఫ్‌సీఐ గోదాము వద్ద నినాదాలు చేస్తున్న హమాలీలు

హమాలీల నిరసన

భీమడోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై గోదాముల్లో పనిచేస్తున్న హమాలీల వేతనాలను తక్షణమే పెంచాలని డిమాండ్ చేస్తూ హమాలీలు భీమడోలు మండలం పాతూరు ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం 2024 జనవరితో ముగిసిందని తరువాత దాన్ని పెంచాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో హమాలీలు రోడ్డున పడ్డారని వాపోయారు. రెండు సంవత్సరాలకు ఒకసారి చేసుకునే ఒప్పందం గడువు ముగిసినప్పటికీ ఎలాంటి చర్యలు లేవని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అయినా స్పందించి హమాలీలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయు అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఎం రాము, నాగేశ్వరరావు, త్రినాథ్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు కార్పొరేషన్: పౌర సరఫర శాఖలో పనిచేస్తున్న హమాలీల జీతాలు పెంచాలని చేసుకున్న ఒప్పందాన్ని జగన్ ప్రభుత్వం దానిని విస్మరించిందని యూనియన్ నాయకులు ఆర్.లింగరాజు, చంద్రశేఖర్‌లు తెలిపారు. జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి రాష్ట్ర యూనియన్ నాయకులతో చర్చించి హమాలీ జీతాలు పెంచాలని కోరారు. యూనియన్ నాయకులు రాంబాబు, దుర్గారావు, మస్తాన్‌వలీ, ముప్పిడి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల ధర్నా

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీలో కార్మి కులకు రెండు నెలల జీతాల బకాయిలు తక్షణం విడుదల చేయాలని సీఐటీయు, ఏఐటీ యూసీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం కార్మికులు ధర్నా జరిపారు. సంఘా ల నాయకులు నత్తా వెంకటేశ్వరరావు, టి.బాబు మాట్లాడుతూ రెండు నెలలుగా జీతాలు లేక ఆ కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయన్నారు.



ఆయుధ కర్మాగారం ఏర్పాటు హర్షణీయం

పోలవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలవరం నియోజకవర్గంలో సుమారు మూడు వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కలిగేలా జీలుగుమిల్లి మండలంలో ఆయుధ కర్మాగార నిర్మాణానికి చర్యలు హర్షణీయమని, నిర్మాణానికి అందరూ సహకరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ యాదవ్ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ మేరకు వారికి కృతజ్ఞతలు తెలిపినట్లు వెల్లడించారు.



ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి: ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. వరద బాధితుల సహాయార్థం ఏలూరు కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోల్‌సేల్ అండ్ రిటైల్ మెడికల్ షాపుల యాజమానులు రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే చంటికి చెక్కు రూపంలో అందజేశారు. ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలిపారు. చోడే వెంకటరత్నం, రెడ్డి నాగరాజు, ఎం.పార్థసారధి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాగంటి బాబుకు ఎన్జీవో నేతల పరామర్శ

ఏలూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఏలూరు మాజీ ఎంపీ, టీడీపీ సీనియర్ నాయకులు మాగంటి వెంకటేశ్వరరావు (బాబు)ను మంగళవారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, ఏలూరు తాలూకా అధ్యక్షకార్యదర్శులు జి.శ్రీధర్‌రాజు, సత్యనారాయణ తదితరులు పరామర్శించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మాగంటి బాబు ఎంపీగా, మంత్రిగా పనిచేసిన కాలంలో ఎన్జీవోస్, ఉద్యోగులతో సామరస్యంగా ఉంటూ ఉద్యోగుల కోసం అనేక సందర్భాల్లో సహాయ సహకారాలు అందించిన వ్యక్తి అని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటూ ఆకాంక్షించారు.

9 నెలల పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు : డీఎంహెచ్‌వో



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట

ఏలూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష కార్యక్రమాల అమలు తీరును మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట పరిశీలించారు. టైటస్ నగర్‌లో వైద్యసిబ్బంది చేస్తున్న పరీక్షల శిబిరాన్ని సందర్శించి నోటి క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలను తనిఖీ చేశారు. ఈ నెల 14నుంచి జరుగుతున్న స్క్రీనింగ్ క్యాంపులు 9 నెలలపాటు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతాయని, ప్రతీ ఇంటినీ సందర్శించి క్యాన్సర్, బీపీ, మధుమేహం, గుండెజబ్బులు అనుమానిత లక్షణాలు గలవారిని గుర్తించి స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు తెలియజేస్తారని వివరించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌లకు పంపిస్తారని తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో నిపుణుల పర్యవేక్షణలో వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందిస్తామన్నారు. అనంతరం చాటపర్రు పీహెచ్‌సీని సందర్శించి పిల్లల ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను పరిశీలించారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరకు నివాళులు

ఇందిరాగాంధీకి ఘన నివాళి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళ వారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 107వ జయంతిని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందిర చిత్రపటానికి ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా బ్యాంకులను జాతీయకరణ చేసి ప్రతీ సామాన్య మనిషి బ్యాంకు లావాదేవీలను జరుపుకునే విధంగా ఎంతో కృషి చేశారన్నారు. ఉన్నమట్ల ఎలీజా తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు విస్సంపల్లి సుందర రావు ఆధ్వర్యంలో జరిగాయి. ఇందిర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. మన్నే వెంకటేశ్వరరావు, కొన్నకళ్ళ కృష్ణమూర్తి, బోసురెడ్డి, సుందరం తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఉంగుటూరు శాఖ గ్రంథాలయంలో మంగళవారం ఇందిర జయంతిని జరిపారు. ఆమె చిత్రపటానికి తాడేపల్లిగూడెం డీవైఈవో నిమ్మగడ్డ రవీంద్ర భారతి, ఆయుర్వేద వైద్యురాలు డా.కస్తూరి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రైస్ కుక్కర్ల వితరణ

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాలిపూడిలోని రైతు వల్లభనేని రత్నమాల తన మనుమడు రాజీవ్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం ఆ గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు రైస్ కుక్కర్లు, ప్రి స్కూల్ పిల్లలకు టవల్స్, ఆహార పదార్థాలు అందచేసి వారి సమక్షంలోనే వేడుకను నిర్వహించారు. సీడీపీవో పద్మావతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు

కామవరపుకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని వరసిద్ధి వినాయక ఆలయం వద్ద మంగళవారం సంకటహర చతుర్థి సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక లలితాశ్రీ పీఠం వ్యవస్థాపకులు దుర్గబాబు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. స్వామివారి సన్నిధిలో దీపాలను ఉంచి ఆరాధించారు.



మరుగుదొడ్ల దినోత్సవంపై అవగాహన ర్యాలీ

ఉంగుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, నారాయణపురం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.కె.విశ్వేశ్వరరావు,సర్పంచి దిద్ద అలకనంద శ్రీనివాసరావు,అధ్యాపకులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు. కాలకృత్యాల అనంతరం చేతులు సబ్బుతో శుభ్రపరచుకోవాలని కోరుతూ సబ్బులు పంపిణీ చేసారు.



రెడ్డి అప్పలనాయుడుకు పలువురి అభినందన

ఏలూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రీజనల్ బోర్డు విజయవాడ జోన్ ఛైర్మన్‌గా బుధవారం ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ రెడ్డి అప్పలనాయుడు పదవీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మంగళవారం పలువురు నగరప్రముఖులు, పలు కుల సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ : మేఘలాదేవి

కొయ్యలగూడెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉండే పార్టీ టీడీపీ అని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. మంగళవారం ఆమె ఆధ్వర్యంలో దళితపేటలో సభ్యత్వాలు చురుగ్గా సాగాయి. టీడీపీ సభ్యత్వాలు తీసుకోవడానికి మహిళలు పెద్దఎత్తున వస్తున్నారని ఆమె తెలిపారు. మహిళా నాయకురాలు కొత్తా రమ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా బుయ్యన శ్రీను



కుక్కునూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం కుక్కునూరు మండల కార్యదర్శిగా బుయ్యన శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కుక్కునూరులో జరిగిన 9వ మండల మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. అలాగే ప్రజలకు ఎదుర వుతున్న పలు సమస్యలను మహాసభలో ప్రతిపాదించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు ఆదివాసీలకు సాగులో ఉన్న పోడుభూముల హక్కులు, 18 ఏళ్లు నిండిన యువతకు పునరావాస పరిహారం, ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని తీర్మానించారు. కమిటీ సభ్యులుగా వై.నాగేంద్రరావు, వైసాయికిరణ్, మేడిపల్లి బాబు, లక్ష్మయ్య, వలీ బాషను ఎన్నుకున్నారు.

రహదారుల నిర్మాణం పరిశీలన

లింగపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతాలోపం ఉండకూడదని వేములపల్లి సర్పంచ్ నత్తా దివ్యదీప్తి అన్నారు. వేములపల్లిలో ఆమె మంగళవారం రహదారి పనులను పరిశీలించారు. ఆమెతోపాటు పత్తా నాగేంద్ర, పాతూరి మురళీ, కూటమి నాయకులు ఉన్నారు.

జమీందారు కుటుంబీకులకు పరామర్శలు

కామవరపుకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీలకర్రగూడెం జమీందారు శ్రీ రాజా రాఘవరాజు సుబ్బరాజు సతీమణి శ్రీ రాజా రాఘవరాజు సత్యవతమ్మ ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. పలు గ్రామాల నుంచి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో జమీందారు నివాసానికి విచ్చేసి వారి కుమారులు శ్రీ రాజా రాఘవరాజు వెంకట్రాజు, రంగరాజు, వీర రామకృష్ణంరాజు, యర్రంరాజు, వెంకట రామకృష్ణంరాజు, నల్ల నారాయణరాజులను పరామర్శిస్తున్నారు.

చిన్నారుల దత్తతపై అవగాహన సదస్సులు

ఏలూరు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల వారీగా నవంబరు నెల దత్తత మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్యచక్రవేణి అన్నారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో అవగాహన సదస్సులను మంగళవారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సూర్యచక్రవేణి దత్తతపై తల్లిదండ్రులకు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. 1098కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే ఆ పిల్లలను సంరక్షణకు తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు. అనధికారికంగా పిల్లలను దత్తత తీసుకోవడం చట్టరీత్యా నేరమని వివరించారు.

పోశమ్మగండి ఆలయానికి రాకపోకల పునరుద్ధరణ

పోలవరం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు ఎగువన అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు గోదావరి నదీ తీరాన ఉన్న పోశమ్మగండి ఆలయానికి రాకపోకలు బుధవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దేవదాయశాఖ సిబ్బంది మంగళవారం తెలిపారు. వరదలు వర్షాల వలన గత మూడు నెలలుగా పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంతో నీటమునిగిన ఆలయం గోదావరి నీటిమట్టం సాధారణ స్థాయికి చేరుకోవడంతో బయటపడింది. ఆలయ సిబ్బంది ఆలయాన్ని శుభ్రపరిచి ఆలయ దర్శనాలను పునరుద్ధరించారు. భక్తులు యథావిధిగా ఆలయానికి రావచ్చని తెలిపారు.

22న ఛలో ఢిల్లీ

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో అత్యవసర, నిత్యావసర మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని, మందుల ధరలు తగ్గించాలని కోరుతూ ఈ నెల 22న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు యూనియన్ నాయకులు బి.వి.సత్యనారాయణ, మొహిద్దీన్ తెలిపారు. మంగళవారం సీఐటీయు కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు.



రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలి : చింతమనేని

పెదవేగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హెచ్చరించారు. లక్ష్మీపురంలో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన పరిశీలించి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రహదారుల మరమ్మతులు విస్మరించడంతో గుంతలమయంగా మారాయన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు గుంతలులేని రహదారులే లక్ష్యంగా చర్యలు చేపట్టారన్నారు. లక్ష్మీపురం సర్పంచ్ మేకా కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

'కోటగిరి రాజీనామా చేయాలి'

ఏలూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరిగిన సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టు ఓటమి పాలైనందుకు బాధ్యత వహిస్తూ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఉన్న మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ రాజీనామా చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్వీఎల్ఎస్ రంగారావు, మాజీ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర సెక్రటరీ రాయుడు నాగేశ్వర రావు డిమాండ్ చేశారు.

పంటల బీమా నమోదు చేయాలి

చింతలపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్న, అపరాల పంటలకు పంటల బీమా నమోదు చేసుకోవాలని ఏలూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు లలిత సుధ పేర్కొన్నారు. మండలంలోని ఉర్లగూడెం, చింతలపూడి నాల్గవ రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటల బీమాలో ఎకరా వరికి రూ. 500, మొక్కజొన్నకు రూ.483 చొప్పున ప్రీమియం చెల్లించాలని, దగ్గరలోని పిఏసిఎస్ సెంటర్లను సంప్రదించాలని, డిసెంబరు 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మండల వ్యవసాయాధికారి మీనాకుమారి, రైతులు పాల్గొన్నారు.

అభయ రక్షక దళం తనిఖీలు

ఏలూరు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం. సుబ్బారావు, ఎస్ఐ కాంతిప్రియ ఆధ్వర్యంలో అభయ మహిళా రక్షక దళం పోలీస్ సిబ్బంది ఏలూరులో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్, నగరంలో ఉన్న వివిధ స్కూల్స్, కాలేజీల ప్రాంతాల్లో పరిశీలించారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా అనుకోని సంఘటనలు ఎదురైతే డయల్ 112కు సమాచారం అందించాలని పది నిముషాల్లో పోలీసులు అక్కడకు చేరుకుంటారని వివరించారు.

రజకుల వృత్తి చెరువులు సర్వే చేయించాలి

ఏలూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రజక వృత్తిదారుల చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి లీజులు నిర్ధారించాలని రాష్ట్ర రజకసంఘ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జనసంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్టయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ కార్యాలయంలో మంగళవారం సమావేశం జరిగింది.



ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో ట్రాఫిక్

పద్మవ్యూహం

పట్టణాలు, కూడళ్లలో పెరిగిపోయిన ట్రాఫిక్ ఇక్కట్లు

పట్టణాల్లో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది.. ఇంటి నుంచి బయటకు వస్తే గమ్యం చేరేవరకు దారీ తెన్నూ కానరావడం లేదు..పెరిగిపోయిన వాహనాలు, కంట్రోల్ చేసేందుకు తగినంత సిబ్బంది లేకపోవడం, పార్కింగ్ లేక రోడ్ల పైనే వాహనాలు నిలిపివేయడంతో ప్రయాణి కులకు నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు.. ఏలూరు, భీమవరం, పాలకొల్లు, తణుకు, పట్టణాలతో పాటు పలు ప్రధాన కూడళ్లలో వాహన దారులు నరకం చూస్తున్నారు..

ఏలూరు అస్తవ్యస్తం

ఏలూరు క్రైం : ఏలూరు నగరంలో నడవాలన్నా, వాహనాలు నడపాలన్నా నరకం చూడా ల్సిందే. ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుని క్షణక్షణం సాహ సాలు చేసుకుంటూ ప్రయాణం సాగించాల్సిందే. ఏలూరులో నిత్యం 50 వేల పైబడే జనాభా రాకపోకలు సాగిస్తూ ఉంటారు. నగరంలో ద్విచక్ర వాహనాలు 10 వేలు పైబడి తిరుగుతుండగా, ఆటోలు ఐదు వేల పైనే తిరుగుతూంటాయి. ఇతర వాహనాలు మరో రెండు వేలకు పైబడే రాకపోకలు కొనసాగిస్తున్నాయి. నగరంలో ట్రాఫిక్ క్రమ బద్ధీకరణకు ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉంది. అయినా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు శూన్యమే. నగరంలో ప్రధాన మైన కూడళ్ళు 50 వరకూ ఉండగా, కేవలం 15 నుంచి 20 పాయింట్లలో మాత్రమే నిత్యం బీటుల్లో పోలీసులు విధులను నిర్వర్తించగలుగుతున్నారు. మరో వైపు వ్యాపారులు తమ షాపుల ముందు రోడ్లను ఆక్రమించి తమ వ్యాపార వస్తువులను రోడ్లపైనే అమరుస్తున్నారు. వాహనాలను పెట్టే వీలులేక పోవడంతో రోడ్ల పైనే పెడుతున్నారు. దీంతో రోడ్లు ఇక్కచిక్కి పోతున్నాయి. ప్రభుత్వాసుపత్రి, ఆర్‌ఆర్ పేట లలో ఆటోలు ఎక్కువడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ఆర్‌ఆర్ పేటలో రోడ్లపైన బళ్ళతో వ్యాపారాలు చేసేవారు వాహనాల రాక పోకలకు ఆటంకంగా మారుతున్నారు. కొన్ని హోటళ్ళకు రోడ్లే పార్కింగ్‌గా మారాయి. కొంతమంది కార్ ట్రావెల్స్‌వాళ్లు రోడ్డే పార్కింగ్ ప్లేస్‌లుగా మార్చేసుకున్నారు. ఏలూరు నగరంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భారీ వాహనాలకు, ట్రాక్టర్లకు అనుమతి లేదు. కానీ ఇసుక ట్రాక్టర్లు, మట్టి టిప్పర్లు 24 గంటలు తిరిగేస్తు న్నాయి. ప్రభుత్వాసుపత్రి ముందు, ఆర్‌ఆర్ పేట రోడ్డులో, సెయింట్ థెరిస్సా రోడ్డులో నిత్యం సాయం త్రం 4 గంటల నుంచి ట్రాఫిక్ జామ్ అవుతున్నా ఒక్క పోలీసు అటుగా రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించు కోకపోవడంతో సమస్య మరింత జటిలమవుతోంది.

భీమవరంలో గజిబిజి

భీమవరం క్రైం :పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. సుమారు 150 ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. వాటికి సంబంధించి నిత్యం 400 బస్సులు వరకు పట్టణం మీదుగా వెళుతూంటాయి. ఉదయం పూట దుకాణాలు తెరవడానికి ముందే వెళ్లడం వల్ల అంత ఇబ్బంది ఉండటం లేదు. సాయంత్రం సమయాల్లో అన్ని పాఠశాలలు, కళాశాలలు ఒకేసారి వదలడం వల్ల పట్టణంలో ట్రాఫిక్ పెరుగుతోంది. భారీ లోడ్ వాహనాలు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను పట్ట ణంలోకి రాకుండా చేసినప్పటికీ రద్దీ తగ్గడం లేదు. ప్రకాశం చౌక్ సెంటర్ పోలీస్ బొమ్మ సెంటర్, బుధవారం మార్కెట్, అంబేడ్కర్ సెంటర్, బొంబాయి స్వీటు సెంటర్, సరోవర్ సెంటర్, అడ్డవంతెన వద్ద నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఉండిరోడ్డులోని రైల్వే గేటు వద్ద కిలోమీటర్లు మేర వాహనాలు నిలి చిపోతున్నాయి. రైల్వేశాఖ డబ్లింగ్ లైన్లు పూర్తి అయ్యాక రైళ్ళను, గూడ్స్ రైళ్ళను భారీగా ఈ లైన్ నుంచి పంపిస్తున్నారు. దీంతో ప్రతీ 20 నిమిషాలకు గేటు పడుతూ ఉండటంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఒక్కసారిగా వాహనాలు పట్టణంలోకి రానీయకుండా చూడాలని ప్రయాణికులు, వాహనాలు పట్ట ణంలోకి రానీయకుండా చూడాలని వాహనదా రులు కోరుతున్నారు.

పాలకొల్లులో ఇరుకు రోడ్లు

పాలకొల్లు అర్బన్ : పట్టణంలో మెయిన్ రోడ్డులో వ్యాపారాలతో పాటు క్షీరా రామలింగే శ్వరస్వామి ఆలయం కూడా ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. బ్యాంక్ వీధిలో ఐదు బ్యాంకులు ఉండటంతో పాటు మెయిన్‌రోడ్డు నుంచి బ్రాడీపేట, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కు వెళ్ళే దారి..లాకుల వద్ద, రైలు గేటు వద్ద ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తగినంత ట్రాఫిక్ పోలీసులు లేకపోవడం, ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు లేకపోవడంతో సమస్య ఎక్కువవుతోంది. చిన్న, చిన్నసందుల్లో వ్యాపార సంస్థలు అధికంగా ఉండటంతో కనీసం ఆటోలు, బైక్‌లు కూడా వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

తణుకులో నిత్య నరకం

తణుకు: పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోయాయి. వాహనాల రద్దీ కారణంగా ప్రజలు తీవ్ర అవస్థలు ఎదు ర్కొంటున్నారు. రాష్ట్రపతి రోడ్డులో ఈ సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. వాణిజ్య వ్యాపార సముదాయాలు, ఆసుపత్రి ఇదే రోడ్డులో ఉండడంతో వాహనాల రాక పోకలతో రహదారి కిక్కిరిసిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సాయంత్రం పాఠశాల బస్సులు, వివిధ కార్మికులు ఒక్కసారిగా రావడంతో రహదారులన్నీ రద్దీ మారుతున్నాయి.

పోక్సో నేరస్థులపై ప్రత్యేక నిఘా: ఐజీ

ద్వారకాతిరుమల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు ఒడిగట్టే పాత నేరస్తులపై రౌడీ షీట్లను ఓపెన్ చేసి ప్రత్యేక నిఘా పెడతామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్‌తో కలసి తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను, క్రైమ్ రేటును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీవారి ఆలయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకున్నట్లు ఐజీ చెప్పారు. ఆలయం ఇప్పటికే సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉందని అదనంగా మరికొన్ని సీసీ కెమేరాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ముదుగా చినవెంకన్న ఆలయాన్ని ఐజీ సందర్శించారు.స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్న అనంతరం అర్చకుల నుంచి శ్రీవారి శేషవస్త్రం, ఆశీర్వచనం పొందారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

భీమడోలు: భీమడోలు సర్కిల్ పరిధిలో జాతీయ రహదారులు ఉన్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు ఇచ్చామని ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ఎస్పీ కిశోర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ విల్సన్, ఎస్‌ఐ సుధాకర్ పాల్గొన్నారు.

రైళ్ల దారి మళ్లింపు



ఏలూరు క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు మీదుగా వెళ్తున్న రైళ్ళలో కొన్ని రైళ్ళను దారిమళ్ళించడం వల్ల ఏలూరు, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లలో సంబంధిత స్టాప్ ఉండదని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ప్రకటించారు. గన్నవరం, ముస్తాబాదు, చేబ్రోలు సెక్షన్ పరిధిలో ట్రాఫిక్ మెయింటినెన్స్ నిర్వహిస్తున్న నేపథ్యంలో రైళ్ళను ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా కాకుండా విజయవాడ, గుణదల, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా వెళ్తాయని తిరిగి నిడదవోలు, భీమవరం టౌన్, గుణదల, విజయవాడ మీదుగా వెళ్తాయన్నారు.

దారి మళ్ళించే రైళ్లు ఇవే

రైల్ నెంబర్ 13351 ధన్‌బాగ్ - అల్పూజా ఈనెల 19 నుంచి 23 వరకూ 25 నుంచి 30 వరకూ దారి మళ్ళింపు. 18111 టాటా - యశ్వంత్‌పూర్ ఈనెల 21, 28 తేదీలలో దారిమళ్ళింపు, 12376 జాసిద్ -తాంబ్రమం ఈనెల 20, 27 తేదీలలో దారిమళ్ళింపు, 18637 హట్యాయ్ - ఎస్‌ఎంవి బెంగళూరు ఈనెల 23, 30 తేదీలలో దారిమళ్ళింపు, 12889 టాటా -ఎస్‌ఎంవి బెంగళూరు ఈనెల 22, 29తేదీలలో దారి మళ్ళింపు, 22837 హట్యాయ్ - యర్నాకుళం ఈనెల 25వ తేదీన దారి మళ్ళింపు, 12835 హట్యాయ్ - ఎస్‌ఎంవి బెంగళూరు ఈనెల 19, 26 తేదీలలో దారి మళ్ళింపు, 18503 విశాఖపట్నం - శిర్డిసాయినగర్ ఈనెల 28వ తేదీన దారి మళ్ళింపు, 12803 విశాఖపట్టణం - హజరత్ నిజాముద్దీన్ ఈనెల 29వ తేదీన దారి మళ్ళింపు ఉంటుంది.

రైతులకు రసీదులు ఇవ్వాలి : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వాణి

నూజివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విత్తన రకాలు సాగు చేస్తున్న రైతులకు ఆర్గనైజర్లు విధిగా రశీదులు ఇవ్వాలని, లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నూజివీడు ఆర్డీవో బి.వాణి హెచ్చరించారు. నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం విత్తన మొక్క జొన్న ఆర్గనైజర్లు, రైతు సంఘం నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులతో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గత అనుభవా లను దృష్టిలోకి తీసుకుంటే కొందరు ఆర్గనైజర్లు నాసిరకపు విత్తనాలు ఇవ్వడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విధిగా రైతులకు విత్తనాలు ఇచ్చే సందర్భంలో ఆర్గనైజర్లు సంబంధిత రశీదులను ఇవ్వాలన్నారు. అదే సందర్భంలో రైతులు కూడా ఆర్గనైజర్లతో స్పష్టమైన ఒప్పందాలను రాతపూర్వకంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్ మాట్లాడుతూ నూజివీడు డివిజన్‌లో దాదాపు 40వేల ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న, మరో 1500 ఎకరాల్లో సీడ్‌పత్తి సాగులో ఉందని, వారు విధిగా రైతులతో రాతపూర్వక ఒప్పందాలు చేసుకోవాలన్నారు. నూజివీడు మండల వ్యవసాయశాఖ అధికారిణి ఏ.చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



దీపాలంకరణ

ఆగిరిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని ప్రధాన శివాలయం వద్ద కార్తీకమాస సందర్భంగా మహిళలు ప్రత్యేక దీపాలంకరణ చేసి భక్తిని చాటుకున్నారు. శివలింగం ఆకారంలో ఉన్న ఈ ప్రత్యేక దీపాలంకరణ భక్తులను ఎంతో ఆకట్టుకున్నది.



నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు

ముసునూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోపవరంలో నాగేంద్రస్వామికి కార్తీక మంగళవారం పర్వదినాన విశేష అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ అర్చకులు చిట్టిబాబు ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేసి, కాల సర్పదోష నివారణ పూజలు చేశారు.

కుమ్మరివారి బజారులో డ్రెయినేజీ పరిశీలన

ముసునూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట కుమ్మరివారి బజారులో డ్రెయినేజీ సమస్యను నూజివీడు ఆర్డీవో వాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ బజారులో డ్రెయినేజీ లేక వర్షం కురిస్తే నివాసాల్లోకి నీరు చేరడంతోపాటు ఇళ్ళు చుట్టు చెరువును తలపించేలా నీరు రోజుల తరబడి నిల్వ ఉంటుందని, దీంతో ఇళ్ళు నానిపోయి కూలిపోయే పరిస్థితులు నెలకొన్నాయంటూ కాలనీవాసులు ఆర్డీవో ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ, రెవిన్యూ అధికారులతో ఆమె మాట్లాడారు. డ్రెయినేజీ ఏర్పాటుకు కావాల్సిన ల్యాండ్‌పై సమగ్ర నివేదికను వెంటనే అందజేయాలని తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను ఆర్డీవో ఆదేశించారు.

ఘనంగా పురుషుల దినోత్సవం

ముసునూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో పురుషుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయులు బి.పద్మలత, పద్మావతి, కిరణిలు సీనియర్ ఉద్యోయులను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబంలో యాజమానిగా, తండ్రిగా, అన్నగా పురుషుడు నిర్వహించే బాధ్యతలు గొప్పవని అభివర్ణించారు. పురుషులను గౌరవించి, సన్మానించినందుకు హెచ్‌ఎం అబ్బాస్, సహచర ఉపాధ్యాయులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

బాల్య వివాహం నేరం

కైకలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. కైకలూరు రెండో సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. బాల్య వివాహాలు జరిగితే దగ్గరలోని అధికారులకు, పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. తల్లిదండ్రుల అవగాహనతో ప్రతి ఆడపిల్లకు 18 ఏళ్లు నిండే వరకు పెళ్ళి చేయకూడదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు వి.గంగాచలం, ఎం.వెంకటలక్ష్మి, లీలావతి, సీహెచ్.లక్ష్మి, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం ఎండీ ఈసా తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంతో అవగాహన కార్యక్రమాలు

మండవల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా దినోత్సవం సందర్భంగా బాలికలకు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై చిత్రలేఖనం, డిజిటల్ లైబ్రెరీ అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గ్రామ కార్యదర్శి ఎం.కొండలు, హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్యను బలోపేతం చేయాలి



హెచ్‌ఎంలతో ఆర్.జె.డి జి.నాగమణి

ఆగిరిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఉత్తమ నాయకత్వ శిక్షణ ద్వారా పాఠశాల విద్యను బలోపేతం చేసి త ద్వారా విద్యార్థుల సర్వతోముకాభివృద్ధికి కృషి సల్పాలని రాష్ట్ర విద్యాశాఖ జోన్ -2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి అన్నారు. తోటపల్లిలో హీల్ పారడైజ్ ఆవరణలో సోమవారం నుంచి ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించబడుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్యామ్‌సుందర్ ప్రారంభించారు.

అగ్నిప్రమాదాల నివారణకు ప్రణాళిక



కైకలూరు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక సేవలను మరింత అందుబాటులోకి తెచ్చి ప్రమాదాల నివారణకు ప్రణాళిక రూపొందించినట్లు ఫైర్ అడిషనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసులు అన్నారు. కైకలూరు అగ్నిమాపక కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి వాహనం పనితీరు, ప్రమాదాల సమయంలో వినియోగించే వస్తువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా ప్రతి అగ్నిమాపక వాహనానికి జీపీఎస్ ట్రాక్ సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు. 112 నెంబర్ అందుబాటులో తీసుకువచ్చి సత్వర సేవలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కైకలూరు ప్రాంతంలో ఆక్వా మందులు దుకాణాలు ఎక్కువగా ఉన్నందున ఇటీవల అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, దుకాణాల యజమానులు తగు జాగ్రత్తలను పాటించేలా అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కైకలూరు అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

చాట్రాయి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పేద కూలీల జీవనోపాధికి, గ్రామాల అభివృద్ధి కోసం ఉద్దేశించిన ఉపాధిహామీ పథకం నిధులను దుర్వినియోగం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కెవి సుబ్బారావు, జిల్లా ఇన్‌చార్జి విజిలెన్స్ అధికారి పి.పురుషోత్తం హెచ్చరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో చాట్రాయి మండల ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికను ఏలూరులోని డ్వామా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. మొత్తం రూ.11.25 కోట్ల పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ నివేదికను ప్రజావేదికలో సమీక్షించారు. ఉపాధిహామీ సిబ్బంది రూ.95,626 రికవరీ, రూ.18 వేలు జరిమానాలు విధించారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



కైకలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మహోన్నతమైనవని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు నోబుల్ అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. వి.కృష్ణ, మద్దిరాల సంజీవరావు, దండే సైమన్‌రాజు, అజిత్ ఓరిగంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్యంతో ఆయిల్‌పామ్ అధిక దిగుబడులు

చాట్రాయి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు లాభాలు పొందవచ్చని మండల ఉద్యాన శాఖ అధికారిణి ఆర్. హేమ అన్నారు. బూరుగ్గూడెం, చనుబండ గ్రామాల్లో మంగళవారం ఆయిల్‌పామ్ తోటల్లో రైతులతో కలసి ఆమె క్షేత్ర పరిశీలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ విస్తీర్ణ పథకం కింద యంత్ర పరికరాలకు రాయితీలు ఉన్నాయని, 4 ఏళ్ళ లోపు తోటల్లో అంతర్ పంటలు వేసుకుంటే రాయితీలు అందిస్తామన్నారు. గోద్రేజ్ కంపెనీ మేనేజర్ శ్యామ్‌సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ మినుము విత్తనాల పంపిణీ

కలిదిండి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీపై అందించే మినుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో విద్యాసాగర్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సబ్సిడీ మినుము విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. ఎకరాకు 8 కిలోలు చొప్పున 30 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో మినుము విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, వ్యవసాయ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ముసునూరు/ఆగిరిపల్లి, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో నైపుణ్యత సాధిం చాలని గ్రంథాలయాల అధికారులు టి.రాజేశ్వరి, జె.సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆరవరోజు ముసునూరు, గోపవరం శాఖ గ్రంథాలయాల్లో మహిళా దినోత్స వం సందర్భంగా మహిళ పోలీసులు సంధ్యా రాణి, మేకా లక్ష్మీప్రసన్న మహిళా సాధికారతపై వివరించారు. అనంతరం విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఆగిరిపల్లి శాఖ గ్రంథాల యంలో మంగళవారం మహిళా సాధికారిత అనే అంశంపై సదస్సు నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ముదినేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలపర్రు గ్రామంలో ఒక వ్యక్తి చేపల చెరువులో అనుమానాస్పద స్థితిలో శవమై తేలాడు. గ్రామానికి చెందిన సంకు రాత్రి వెంకట్రావు (48) భార్య, కుమారుడిని వదిలి ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 15న కూలి పనులకు వెళ్లిన వెంకట్రావు యజమాని వద్ద సొమ్ములు తీసుకుని వెళ్లి అదేరోజు రాత్రి నుంచి కనిపించలేదు. ఈ నెల 16 ఉదయం నుంచి కొంతమంది అతడి కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం రాత్రి 9 గంటలకు గ్రామ సమీపంలోని ఒక చేపల చెరువులో శవమై కనిపించాడు. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీఎస్.వీరభద్రరావు తెలిపారు.



వెంకట్రావు (ఫైల్)

ఎక్సైజ్ దాడులు

నూజివీడు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 20 మద్యం సీసాలు స్వాధీన పరుచుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నూజివీడు మండలం సుంకొల్లు గ్రామానికి చెందిన పల్లెపాం సుదర్శన్ రావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 14 మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నట్లు ఆయన తెలిపారు. ఆగిరిపల్లికి చెందిన పరసా కొండలరావును అదుపులోకి తీసుకుని అతనివద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై బి.రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

నూజివీడు: ఎక్సైజ్ అధికారులు బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. చాట్రాయి మండలం చాట్రాయిలో భూమిలో పాతిన 28 ప్లాస్టిక్ డ్రమ్ములను వెలికితీసి వాటిలో నిల్వ ఉంచిన 2,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు బెల్లపుఊటను నిల్వఉంచిన నల్గొండ జిల్లా వెంకతురం గ్రామానికి చెందిన బానోతు రాజును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చంద్రుపట్ల తండాకు చెందిన బాణావతు కృష్ణను, కలగర తండాకు చెందిన అజ్మీరా శ్రీనుపై కేసు నమోదు చేశామని వివరించారు.

14న లోక్‌అదాలత్

నూజివీడు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 14వ తేదీన లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లాజడ్జి ఎ.నాగ శైలజ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పరిష్కరించదగ్గ కేసులను న్యాయవాది ద్వారా ఇరుపార్టీలు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చన్నారు. చెక్‌బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, మోటారు యాక్సిడెంట్ కేసులను పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు.

దుమ్మెత్తి పోస్తున్న రోడ్లు

ఆగిరిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లిలోని గన్నవరం రోడ్డుకు చేసిన ఆర్‌అండ్‌బీ ప్యాచ్ వర్క్‌లు వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. ప్రత్యేక నిధుల ద్వారా మరమ్మతులు చేసి ప్యాచ్ వర్క్ పూర్తి చేసిన ఆర్‌అండ్‌బి శాఖ దాని పై తారురోడ్డు వేయటం ఆలస్యం చేస్తుంది. ప్యాచ్‌వర్క్ చేసిన రోడ్డుపై వాహనాలు వెళుతుంటే వెనుక వారికి దారి కనపడనంతగా దుమ్ములేచి వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ముసునూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రమణక్కపేట గ్రామానికి చెందిన ఓ బాలిక మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. బాలిక తల్లిదండ్రులు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్ళి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల బంధువుల ఇంటిలో ఎంత వెతికినా ఆచూకీ లభ్యంకాకపోడంతో అదే గ్రామానికి చెందిన ఆముదాల నవీన్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ, తల్లి నిర్మల ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

బీజేపీ పటిష్ఠానికి చర్యలు

నూజివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలవారీగా బూత్‌కమిటీలను బలోపేతం చేస్తూ బీజేపీని పటిష్టపరిచేందుకు చర్యలు తీసుకోవాలని నూజివీడు మండల బీజేపీ అధ్యక్షుడు గోగినేని శ్రీనివాసకుమార్ అప్పారావు అన్నారు. నూజివీడు మండలం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని గొల్లపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సత్వరం స్పందించి సమస్యల పరిష్కారం చేస్తూ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలన్నారు. మండల సంస్థాగత ఎన్నికల అధికారులు వై.ఎస్ దొర్రై, జాస్తి నాగేశ్వరరావు, గోగినేని వెంకట శశిరేఖ, బీజేపీ మండల ఉపాధ్యక్షులు నెక్కళపు కృష్ణారావు, ఎస్సీమోర్చా అధ్యక్షులు దారావతు శంకరం, ఎస్సీమోర్చా నాయకులు ఎలీషా పాల్గొన్నారు.

మత్తు వదిలితేనే భవిష్యత్

ఆగిరిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అడవినెక్కలం గ్రామంలోని చుక్కపల్లి ఉన్నత పాఠశాలలో మత్తు వదిలితేనే భవిష్యత్తు అనే అంశం పై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్.దేవమని మాట్లాడుతూ విద్యార్థులు మంచి బాటలో నడవాలని, చేదు అలవాట్లకు లోను కాకూడదు అని అన్నారు. అనంతరం అడవినెక్కలం సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి లతా, పంచాయతీ సెక్రటరి ఆర్.వి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఈ పోటీలు నిర్వహించిన నవజీవన్ బాల భవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సీడ్ రైతులకు రక్షణ కల్పించాలి

నూజివీడు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విత్తన రకాలను సాగుచేసే రైతులకు రక్షణ కల్పించే దిశగా ఖచ్చితంగా అగ్రిమెంట్‌ను ఇచ్చేలా కంపెనీలపై చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు నరసింహారావు తదితరులు ఆర్డీవోకి విజ్ఞప్తి చేశారు. రైతుసంఘం నాయకులు టి.జమలయ్య, రాయంకుల లక్ష్మణరావు, నిమ్మగడ్డ నరసింహ తదితరులు ఆర్డీవోని కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ హైబ్రీడ్‌సీడ్ మొక్కజొన్న విత్తనం వల్ల రైతులకు అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని, వీటి పరిష్కారానికి కమిటీని నియమించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



క్రీడాకారులను ప్రోత్సహించాలి

నూజివీడు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి కనబరిచేలా వ్యాయామ ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని స్కూల్‌కాంప్లెక్స్ చైర్మన్, ఎస్.ఆర్.ఆర్ బాయిస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని బి.హేమలత కోరారు. నూజివీడు నియోజకవర్గ స్కూల్‌కాంప్లెక్స్ సమావేశం ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా, హెల్త్ ఎడ్యుకేషన్, ఫుడ్‌క్వాలిటీ తదితరాలపై వ్యాయామ ఉపాధ్యాయులు దృష్టిపెట్టాలన్నారు.

చిన్నంపేట పంచాయతీ కార్యదర్శిగా పార్థసారథి

చాట్రాయి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేట పంచాయతీ కార్యదర్శిగా సీహెచ్‌వీఆర్‌ఎస్ పార్థసారథి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పాలకొల్లు మండలం నుంచి ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ప్రజాప్రతినిదులు, అధికారుల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.